
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

ఖమ్మం

KHAMMAM

శనివారం, 26 జూలై 2025



భద్రాచలం వద్ద నీట మునిగిన స్నానఘట్టాలు



మున్నేరు ఉధృతి

ముసురేసింది..

- ఉమ్మడి జిల్లాలో విస్తారంగా వాన
- ఎడతెరిపిలేని వర్షాలతో జలకళ
- నిండుకుండల్లా ప్రాజెక్టులు, పలు చెరువులు
- వాగులు, వంకలకు పెరుగుతున్న వరద
- ఖమ్మం మున్నేటికి కొనసాగుతున్న ప్రవాహం
- భద్రాచలం వద్ద పెరుగుతున్న గోదావరి నీటిమట్టం
- సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం

ఖమ్మం / కొత్తగూడెం/పాల్వంచ రూరల్/ భద్రాచలం/ దుమ్ముగూడెం/చర్ల, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఐదురోజులుగా అంతరాయం లేకుండా వానలు పడుతున్నాయి. మొదటి రెండు రోజులు మోస్తరు వానలు పడినా.. ఆ తర్వాత నుంచి ముసురు పట్టింది. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని ప్రాజెక్టులు, చెరువులు, వాగులు, వంకలు జలకళ సంతరించుకున్నాయి. పలు వాగులు ఉప్పొంగుతుండగా.. చెరువులు అలుగులు పారుతున్నాయి. దీంతో రైతులు సాగుపనుల్లో నిమగ్నమయ్యారు. ఖమ్మం జిల్లాలో గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయం8.30 వరకు 1.78 సెంమీ సగటు వర్షపాతం నమోదయింది. కల్లూరులో అత్యధికంగా 4.56 సెంమీ, పెనుబల్లిలో 3.02, సత్తుపల్లి 2.8, మధిరలో 2.5, సింగరేణిలో 2.24, రఘునాథపాలెంలో 2.14, నేలకొండపల్లిలో 2 సెంమీ వర్షపాతం నమోదైంది. కామేపల్లిలో 1.98, తల్లాడలో 1.78, కూసుమంచి, కొణిజర్ల, ఎన్కూరులో 1.4, వైరాలో 1.3, వేంసూరు, తిరుమలాయపాలెంలో 1.1, ఖమ్మం అర్బన్ లో 1 సెంమీ వర్షపాతం నమోదైంది. కాగా శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు ఎన్కూరులో 2.1, సింగరేణిలో 2 సెంమీ, పెనుబల్లిలో 1.3, వైరాలో 1.15, తల్లాడలో 1.13 సెంమీ వర్షపాతం నమోదైంది. భద్రాద్రి జిల్లాలోనూ మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా చెరువులు, కుంటలు నీటితో నిండుతున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడే అవకావం ఉండటంతో జిల్లా అధికారులు అప్రమత్తం చేశారు. శుక్రవారం ఇల్లెందులో అత్యధికంగా 36మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. గుండాల, ఆళ్లపల్లి అడవుల నుంచి వరదనీరు కిన్నెరసానికి భారీగా రావడంతో ఆళ్లపల్లి సమీపంలో ఉన్న కిన్నెరసానివాగుకు వరదనీరు పెద్దఎత్తున వస్తుండటంతో రవాణాకు అంతరాయం ఏర్పడుతోంది. సింగరేణిలోని ఇల్లెందు, మణుగూరు, సత్తుపల్లి ఓపెన్‌కాస్టుల్లో వర్షాల కారణంగా బొగ్గు ఉత్పత్తికి తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. ముర్రేడువాగు, గోధుమవాగుల్లో వరద ఉధృతి పెరుగుతుంది. గోధుమవాగు బ్రిడ్జిపై వాన నీరు భారీగా చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుంది. జాతీయ రహదారిపైనే నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. పాల్వంచలో 14.0 మి.మి, సుజాతనగర్‌లో 9.8మి.మి, మణుగూరులో 5. 3, దుమ్ముగూడెంలో 5.5, టేకులపల్లిలో 13. 8, అశ్వారావుపేటలో 10.3మి.మి, కరకగూడెంలో 8.8మి.మి, భద్రాచలంలో 7.8మి.మి, చర్లలో 12.5మిల్లిమీటర్ల వర్షపాతం నమోదైంది.



కిన్నెరసానిలో రెండు గేట్లు ఎత్తిన దృశ్యం

రెండు గేట్ల ద్వారా కిన్నెరసాని నీటి విడుదల

కిన్నెరసాని జలాశయానికి వరద ప్రవాహం భారీగా వస్తుండటంతో శుక్రవారం రాత్రి రెండు గేట్లు ఎత్తి 2వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఈ క్రమంలో కిన్నెరసాని నుంచి 22కిలోమీటర్ల పొడువున ప్రవహించే పరివాహక గ్రామాల ప్రజలు వాగులు దాటొద్దని ప్రతీ గ్రామంలో జెన్కో అధికారులు ప్రచారం చేస్తున్నారు. ఎగువ ప్రాంతం నుంచి సగటున ఇన్‌ఫ్లో 2వేల క్యూసెక్కుల నీరు వస్తుండగా.. (మిగతా 6వ పేజీలో)



● నిండుతున్న సాగర్

ఆయకట్టు రైతుల్లో ఆశలు

- ముమ్మరంగా సాగుతున్న వరి నాట్లు
- వ్యవసాయ పనుల్లో రైతులు బిజీ బిజీ 6



వర్షాల రాకతో యూరియాకు డిమాండ్

- అవసరాలకు సరిపడా సరఫరా కాని ఎరువులు 6

సీపీఐ జిల్లా మహాసభలకు.. 'పేట' ముస్తాబు

- నేడు, రేపు నిర్వహణ.. 7
- ఏర్పాట్లు పూర్తి చేసిన నాయకులు
- తరలిరానున్న జాతీయ, రాష్ట్ర నేతలు



పేట రింగ్‌రోడ్ కూడలిలో సీపీఐ తోరణాలు

ఖమ్మం ఆర్డీవో ఆఫీసులో కంప్యూటర్లు జప్తు

'బైపాస్' పరిహారం విషయంలో జిల్లా కోర్టు ఉత్తర్వులు 7



స్వగృహాకు.. మోక్షం!

ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ఆర్ హయాంలో మధ్యతరగతి ఉద్యోగ వర్గాల కోసం చేపట్టిన రాజీవ్ స్వగృహ భవనాలు.. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత బీఆర్ఎస్ పాలనలో అసంపూర్తిగా నిలిచిపోయాయి. రూ.కోట్లు ఖర్చు పెట్టి ప్రారంభించిన ఆ నిర్మాణాలను వదిలేయడంతో ఇటు ఆయా వర్గాల వారి సొంతింటి కల సాకారం కాక.. ఇటు ప్రభుత్వ సొమ్ముకు సార్థకత లేకుండా పోయింది. ఈ నేపథ్యంలో రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు ఆ అసంపూర్తి భవనాలను టెండర్ల ద్వారా విక్రయించేందుకు ప్రయత్నిస్తోంది. ఈ ప్రయత్నం ఏ మేరకు ఫలిస్తుందోనన్న చర్చ సర్వత్రా జరుగుతోంది.

ఖమ్మం, జూలై 25 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో అసంపూర్తిగా వదిలేసిన రాజీవ్‌స్వగృహ భవనాలకు మోక్షం లభించబోతుంది. రాజీవ్ అనే పేరు ఉందన్న కారణంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు పెట్టి నిర్మాణం చేపట్టిన భవనాలను అసంపూర్తిగా వదిలేసింది. మధ్యతరగతి వర్గాల సొంతింటి కలను నిజం చేసేందుకు ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖరరెడ్డి నేతృత్వంలోని నాటి కాంగ్రెస్ సర్కారు రాజీవ్ స్వగృహ పేరుతో జిల్లాలోని ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి వద్ద రాజీవ్‌స్వగృహ టౌన్‌షిప్‌ను నిర్మించింది. ఆ తర్వాత రాష్ట్ర ఆవిర్భావం జరిగి బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత అసంపూర్తిగా వదిలేసిన ఈ భవనాలను ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం తిరిగి టెండర్లు పిలిచి విక్రయించాలని నిర్ణయం (మిగతా 6వ పేజీలో)

- ఎట్టకేలకు అసంపూర్తి భవనాలకు టెండర్లు
- వేలం ద్వారా విక్రయాలకు సర్కారు నిర్ణయం
- గతంలో రెండు సార్లు పిలిచినా స్పందన కరువు
- ఈ సారైనా ప్రభుత్వం కృషి ఫలించేనా?

ప్రసవ కష్టాలు!

- పురిటి నొప్పులతో 108కు సమాచారం..
- రోడ్డు లేక మధ్యలోనే నిలిచిన వాహనం
- అప్పటికే ఇంటి వద్ద ప్రసవం..



తల్లీబిడ్డలను అంబులెన్స్ వద్దకు ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్న దృశ్యం

గుండాల, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఏళ్లు గడుస్తున్నా గిరిజన పల్లెలు అభివృద్ధికి ఆమడ దూరంలో మగ్గుతున్నాయి. రోడ్డు సదుపాయాలు లేకపోవడంతో గిరిబిడ్డలు అగచాట్లు పడుతున్నారు. రాష్ట్రంలోనే అతి చిన్న పంచాయతీ అయిన భద్రాద్రి జిల్లా ఆళ్లపల్లి మండల పరిధిలోని దొంగతోగు గ్రామానికి చెందిన ఓ మహిళ ప్రసవం కోసం పడిన నరకయాతన గిరిజనుల అవస్థలకు అద్దం పడుతోంది. ఈసం స్వరూపకు శుక్రవారం ఉదయం పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. నెలలు నిండక ముందే రెండో కాన్పు పురిటి నొప్పులు కావడంతో 108కి సమాచారం ఇచ్చారు. మరో వైపు జోరువాన, వాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో వాగులు దాటే పరిస్థితి లేదు, రోడ్డు బురదమయం కావడంతో 108వాహనం మార్గమధ్యలోని నడిమిగూడెం గ్రామ సమీపంలోనే నిలిచిపోయింది. కానీ అప్పటికే స్వరూప ఇంటివద్దనే సాధారణ ప్రసవమై పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అనంతరం భర్త కృష్ణారావు, గ్రామస్థుల సాయంతో తల్లీబిడ్డలను ట్రాక్టర్‌లో 6కిలోమీటర్లు ప్రయాణించి 108 వద్దకు తీసుకువెళ్లి.. గుండాల ఆస్పత్రికి తరలించి వైద్యపరీక్షలు చేయించారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నారని, నెలలు నిండక ముందే కాన్పు కావడంతో పాప బరువు తక్కువగా ఉందని కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలిస్తున్నట్టు వైద్యులు తెలిపారు.



ఈ డ్రాగన్ ఫ్రూట్ పంటకు భారీగా పెరిగిన రాయితీలు



అరటి

'ఉద్యాన' సాగుకు ప్రోత్సాహం

- ఐదు పంటలతో పాటు మల్చింగ్ విధానానికీ రాయితీలు
- ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

అశ్వారావుపేట రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఉద్యాన పంటల సాగును మరింత పెంచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇందుకోసం నూతనంగా పంటలు సాగు చేసే రైతులకు ఇచ్చే రాయితీలను భారీగా పెంచుతూ మూడు రోజుల క్రితం రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది నుంచి కొత్తగా సాగు చేసే రైతులకు పెంచిన రాయితీలను అందించనున్నారు. ఐదు రకాల పంటలతో పాటు మల్చింగ్ విధానంలో పంటలు సాగు చేసే రైతులకు పెరిగిన రాయితీలు ఈ ఏడాది నుంచే ఇవ్వనున్నారు. పంట రకాన్ని బట్టి ఒక్కో పంటకు రెండు మూడు సంవత్సరాల పాటు రాయితీలు చెల్లించనున్నారు. అంతర పంటగా సాగు చేసిన పంటలకు కూడా రాయితీలు వర్తిస్తాయి. తద్వారా రైతులకు రాయితీ అనేది కొంతమేర సాగుకు ఆర్థిక సహాయంగా ఉపయోగపడనుంది.

1,81,240 ఎకరాల్లో ఉద్యాన పంటల సాగు

భద్రాద్రి జిల్లాలో ఇప్పటికే వివిధ రకాల ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. రాష్ట్రంలోనే భద్రాద్రి జిల్లాకు ఉద్యాన పంటల సాగులో ప్రత్యేక స్థానం ఉంది. ఎక్కడా సాగు చేయని పంటలను ఈ ప్రాంతంలోనే సాగు చేస్తారు. అందులోనూ రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సొంత జిల్లా కావడంతో ఉద్యాన పంటల సాగును చేపట్టేందుకు ఏటా ముందుకు వస్తూనే ఉన్నారు. జిల్లావ్యాప్తంగా (మిగతా 6వ పేజీలో)



రైతులు సద్వినియోగం చేసుకోవాలి

కిషోర్, భద్రాద్రి జిల్లా ఉద్యాన శాఖాధికారి

ఉద్యాన పంటలకు రాయితీలు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. పెరిగిన రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకుంటూ పంటల సాగుకు ముందుకు రావాలి. పంటలు వేసిన తరువాత రాయితీల కోసం సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకొని రాయితీలు పొందాలి.



'ఉపాధి'లో కొత్త విధానం

- శ్రీకారం చుట్టిన గ్రామీణాభివృద్ధిశాఖ
- నిబంధనలు కఠినతరం
- పని ప్రదేశంలో కూలీల ఫొటోలపై నిరంతర పర్యవేక్షణ
- రెండు విడతల హాజరుకు పకడ్బందీ చర్యలు

బోనకల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి):గ్రామీణ ప్రాంతాల్లో పనులు దొరకక కూలీలు వలస వెళ్తున్నారని, వాటిని తగ్గించి సొంత గ్రామంలోనే పనులు కల్పించే లక్ష్యంతో 2006లో కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకాన్ని ప్రవేశ పెట్టింది. ప్రతిఏటా నిర్దేశించిన పనుల గుర్తింపు, నిర్వహణతో కూలీలకు ఉపాధి చూపుతున్నారు. కాని పలుచోట్ల కూలీల హాజరుతో పాటు మస్టర్ల నమోదులో అవినీతి జరుగుతుందని సోషల్ ఆడిట్లల్లో తనిఖీ బృందాలు గుర్తించిన దాఖలాలు ఉన్నాయి. రాష్ట్రాల్లో ఈ పథకం సమర్థవంతంగా నిర్వహించడంతో పాటు పారదర్శకంగా పని చేసే వారికే ఉపాధి కల్పించాలన్న ధ్యేయంతో కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ ఇటీవల కొత్త విధానానికి శ్రీకారం చుట్టింది.

అవినీతికి చెక్..

ఉపాధి హామీ పథకంలో కూలీల హాజరులో అవకతవకలకు చెక్ పెట్టే విధంగా పని ప్రదేశంలో రెండు పూటలు కూలీల ఫొటోలను తీయాల్సిందేనని ఉత్తర్వులను జారీ చేశారు. ఒకపూట మాత్రమే తీస్తే అంత వరకే కూలీ పడుతుందని, రెండో పూట కూడా ఫొటో తీస్తేనే పరిగణనలోకి తీసుకొని వేతనాలను చెల్లించడం జరుగుతుంది. పని ప్రదేశంలో తీసిన ఫొటోలను ఎన్ఎంఎంఎస్ (నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్) యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. పనుల కల్పనకు సంబంధించి గుర్తించిన పని ప్రదేశాన్ని యాప్‌లో ఫొటో తీసి అప్‌లోడ్ చేయాలి. అక్కడకు హాజరైన కూలీలు ఆ పని ప్రదేశంలో పనులు చేస్తున్న ఫొటోలు తీసి అప్‌లోడ్ చేస్తేనే వారికి మస్టరు పడుతుంది. బయటకు వచ్చి ఫొటోలు తీస్తే చెల్లుబాటు కావు.

నిబంధనలు కఠినతరం చేసిన గ్రామీణాభివృద్ధిశాఖ

కూలీల హాజరును పకడ్బందీగా నిర్వహించేందుకు కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ నిబంధనలను కఠినతరం చేసింది. పని ప్రదేశంలో ఫీల్డ్ అసిస్టెంట్లు తీసిన ఫొటోలను గ్రామ పంచాయతీ కార్యదర్శి నుంచి, ఏపీవో, ఎంపీడీవో, జిల్లా అధికారులతోపాటు రాష్ట్రస్థాయిలో గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్ వరకు ర్యాండమ్‌గా ప్రతిరోజు పర్యవేక్షిస్తారు. ప్రధానంగా పర్యవేక్షణ చేసే అంశాలను చూస్తే పని ప్రదేశంలో ప్రస్తుతం జరుగుతున్న పనులకు సంబంధించిన ఫొటోలు కాకుండా పాత ఫొటోలను అప్‌లోడ్ చేస్తున్నారా? లేదా? అని చూడాలి. ఫొటోల్లో ఉన్న మహిళలు, పురుషుల సంఖ్య, మస్టర్ల నమోదు సంఖ్యకు సరిపోతుందా? లేదా? వేర్వేరు మస్టర్లల్లో ఒకే వ్యక్తుల ఫొటోలను అప్‌లోడ్ చేశారా? ఉదయం తీసిన కూలీల ఫొటోలే సాయంత్రం కూడా తీశారా? లేదా? అన్న అంశాలను నిశితంగా పర్యవేక్షిస్తున్నారు.

పర్యవేక్షణ ఇలా..

ఎన్ఎంఎంఎస్ యాప్‌లో తీసిన ఉపాధి కూలీల ఫొటోలను పంచాయతీ కార్యదర్శి పర్యవేక్షించి నివేదికను ఎంపీడీవోకు పంపించాలి. మండలంలోని అన్ని గ్రామాల నుంచి వచ్చిన ఫొటోల్లో 20శాతం ఫొటోలు లేదంటే గ్రామానికి రెండు చొప్పున ర్యాండమ్‌గా ఎంపీడీవో, ఏపీవో, సిబ్బంది పర్యవేక్షించి జిల్లా ఉన్నతాధికారులకు పంపాలి. జిల్లా స్థాయిలో అప్‌లోడ్ చేసిన వాటిల్లో 30 ఫొటోలను కలెక్టర్ పర్యవేక్షించాలని ఆదేశాల్లో స్పష్టం చేశారు. డీఆర్‌డీఏ కార్యాలయంలో అధికారులు కూడా జిల్లా వ్యాప్తంగా వచ్చిన ఫొటోల్లో 10శాతం లేదా 200 ఫొటోలను పర్యవేక్షించాలి. గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కూడా రోజుకు 20 ఫొటోలను పర్యవేక్షించాలన్న ఆదేశాలు ఉన్నాయి. యాప్‌లో తీసిన మస్టర్లతో కూడిన ఫొటోల వివరాలను ఇక నుంచి సోషల్ ఆడిట్ పూర్తయ్యే వరకు (ఏడాది కాలం) స్టోర్ చేయనున్నారు. ఫొటోల స్టోరేజీలకు కూడా హార్డ్ డిస్క్‌లను మండలాలకు సరఫరా చేసేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి.



మాట్లాడుతున్న ఆదివాసీ జాతీయ నాయకుడు చందా లింగయ్య దొర

గిరిజనేతరుల చట్టాలకు మేం అడ్డుపడం

- సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవాలి
- ఆదివాసీ జాతీయ నాయకుడు చందా లింగయ్య

కరకగూడెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజనేతరులకు మేము ఎప్పటికీ అడ్డుగా ఉండమని వందల ఏళ్లుగా గిరిజనేతరులు, ఆదివాసీలు సోదరభావంతో కలిసి మెలిసి ఉంటున్నామని ఆదివాసీ జాతీయ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్య దొర అన్నారు. కరకగూడెంలో శుక్రవారం జరిగిన గిరిజనేతరుల సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతాలు అభివృద్ధి చెందాలని గిరిజనేతరులు కూడా జీవించడానికి ఇళ్ల నిర్మాణాలు చేపట్టుకోవాలన్నారు. గిరిజనేతరుల చట్టాలకు మేము ఎప్పటికీ అడ్డుగా ఉండమన్నారు. ఏమైనా చిన్నపాటి సమస్యలు ఉంటే కూర్చొని పరిష్కరించుకోవాలన్నారు. గిరిజనేతరులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గిరిజనేతరులు చందా లింగయ్య దొరకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కొంపెల్లి రామలింగం, చిట్టి వెంకటేశ్వర్లు, సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, రావుల సోమయ్య, బైరిశెట్టి చిరంజీవి, బుడగం రాము, శ్రీరాం చంద్రయ్య, తిప్పని కృష్ణారావు, నాగబండి వెంకటేశ్వర్లు, ముట్టిని ఆదినారాయణ, బైరిశెట్టి వెంకన్న, అక్బర్ ఖాన్, బూరుగడ్డ రవి, కలకం సంతోష్, లెనిన్, పూజారి రమేష్, చిట్టి ప్రసాద్, సాయి, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గరిమెళ్లపాడును అభివృద్ధి చేయాలి

- ప్రశాంతినగర్ పంచాయతీలో ఉద్యాన నర్సరీ
- శిక్షణ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ జితేష్ వి పాటిల్

చుంచుపల్లి/లక్ష్మీదేవిపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గరిమెళ్లపాడును అభివృద్ధి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. శుక్రవారం మండలంలోని ప్రశాంతినగర్ పంచాయతీలో గల హార్టికల్చర్ నర్సరీ శిక్షణ కేంద్రాన్ని (హెచ్ఎన్‌టీసీ) పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. హెచ్ఎన్‌టీసీకి సంబంధించిన భవనం, ఉపాధి హామీలో చేపట్టిన నర్సరీలు, తోటలు పరిశీలించారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో ట్రైబల్స్ సొసైటీ ఏర్పాటుచేసి ట్రైబల్ సంక్షేమంతో పాటు రెవెన్యూ వచ్చే పద్ధతులను చేపట్టి గరిమెళ్లపాడుని అభివృద్ధి చేయాలన్నారు. అనంతరం బీసీ రెసిడెన్షియల్ స్కూల్‌ని సందర్శించి అక్కడ జరిగే తల్లిదండ్రుల సమావేశంలో పాల్గొని విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో చుంచుపల్లి ఎంపీడీవో సుభాషిణి, తహసీల్దార్ పి.కృష్ణ, ఐటీడీఏ హార్టికల్చర్ ఏడీ ఉదయకుమార్, పంచాయతీ కార్యదర్శి రఘు, ఉపాధి హామీ టీఏలు యశ్వంత్, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ఉపయోగపడే మొక్కలు పెంచండి

జీవకోటికి ఉపయోగపడే మొక్కలను పెంచి వనసంరక్షణకు కృషి చేయాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులకు సూచించారు. శుక్రవారం లక్ష్మీదేవిపల్లి మండల పరిధిలోని సింగరేణి నర్సరీని కలెక్టర్ సందర్శించారు. 15 ఎకరాల్లో గల నర్సరీని కలెక్టర్ రెండు గంటలపాటు సందర్శించి వెదురు, గానుగ, వెలగ, చింత తదితర మొక్కలను, వర్మీకంపోస్టు తయారు చేసే విధానాన్ని పరిశీలించారు. నర్సరీలోని మొక్కల పెంపకం, వాటిని ఎక్కడికి పంపుతున్నారనే వివరాలను సింగరేణి నర్సరీ నిర్వాహకుడు డేవిడ్ అభిలాష్‌ను అడిగి తెలుసుకున్నారు. నర్సరీలో సుమారు 7లక్షల మొక్కలను పెంచి సంబంధిత మొక్కలను సింగరేణి ఏరియాల్లో పర్యావరణ పరిరక్షణకు పంపుతున్నట్లు నిర్వాహకులు వివరించారు. అదేవిధంగా అక్కడ పని చేసే సిబ్బందితో కలెక్టర్ ముచ్చటించారు. అనంతరం కలెక్టర్ మొక్క ను నాటి పర్యావరణ పరిరక్షణకు అందరు కృషి చేయాలన్నారు. కలెక్టర్ వెంట ఎంపీడీవో అంకుబాబు, ఆర్ఐ శివకృష్ణ, ఉమ్మడి లక్ష్మీదేవిపల్లి కార్యదర్శులు సాంబయ్య, కృష్ణ ఉన్నారు.



నర్సరీని పరిశీలిస్తున్న భద్రాద్రి కలెక్టర్ జితేష్

● నిండుతున్న సాగర్


ఆయకట్టు రైతుల్లో ఆశలు

- ముమ్మరంగా సాగుతున్న వరి నాట్లు
- వ్యవసాయ పనుల్లో రైతుల బిజీ



కల్లూరులో నాటు వేస్తున్న కూలీలు

కల్లూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఎగువ నుంచి సాగర్‌కు పుష్కలంగా వరద వస్తుండడంతో క్రమక్రమంగా ప్రాజెక్టు నిండుతోంది. జల వనరుల శాఖ సమాచారం ప్రకారం డ్యామ్ పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 590 అడుగులు కాగా, శుక్రవారానికి 577.60 అడుగులకు చేరింది. దీంతో సాగర్ ఎడమకాల్వ ఆయకట్టు రైతుల్లో వానాకాలం పంటపై ఆశలు చిగురించాయి. వారం రోజుల క్రితం పరిస్థితిని గమనిస్తే కల్లూరు సర్కిల్ పరిధిలోని పలు మండలాల్లో సాగర్ ఆయకట్టు కింద సాగు చేసిన వరి.. సాగునీటి ఎద్దడి కారణంగా నారుమడులు ఎండిపోయాయి. ఈ దశలో రైతులు సాగునీటి కోసం ఆందోళన చెందారు. వాస్తవంగా కల్లూరు సర్కిల్ పరిధిలో 1.79,682 లక్షల ఎకరాల భూమి సాగవుతుంది. వర్షాలు ముఖం చాటేసిన పరిస్థితుల్లో సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలను సాగర్ కాల్వ ద్వారా అందించటంతో ఈ ప్రాంతంలో ఎండిపోతున్న పొలాలకు ఊపిరి పోసినట్లయింది. గత ఐదు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పంట పొలాల్లో నీరు చేరింది. దీంతో ప్రధానంగా వరి పైరుకు ప్రాణం పోసినట్లయింది. ఇలా కల్లూరు సర్కిల్ పరిధిలోని కల్లూరు, తల్లాడ, పెనుబల్లి, సత్తుపల్లి, వేంసూరు, మధిర, ఎర్రుపాలెం, చింతకాని, బోనకల్, ముదిగొండ మండలాలు విస్తరించి ఉన్నాయి. ఖమ్మం జిల్లాలోని పాలేరు దిగువ నుంచి ఎడమకాల్వ చివరన గల ఆయకట్టు భూములకు గాను వెయ్యి క్యూసెక్కుల నీరు వస్తుండగా, దీనికి తోడు సీతారామ పాజెక్టు ద్వారా గోదావరి జలాలు సాగర్ కాల్వ ద్వారా సరఫరా అవుతున్నాయి. దీంతో కల్లూరు సర్కిల్ పరిధిలో గల సాగర్ ఆయకట్టు రైతులు ఈ వానకాలం పంటపై ధీమాతో ఉన్నారు. నిబంధనల ప్రకారం మొదటి పంటకు ఆగస్టులో సాగర్ నీరు విడుదల చేస్తారు. అలాంటిది ఈ వానాకాలం సీజన్‌లో సాగర్ నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకొని రైతుల అవసరాల కోసం జూలై నెలలోనే ముందస్తుగా ప్రభుత్వం సాగర్ నీరు విడుదల చేశారు. దీంతో సాగర్ జలాల రాకతో రైతులు సంబర పడుతున్నారు.



వస్తున్న సాగర్ నీరు

ఆయకట్టుకు పుష్కలంగా నీరు అందిస్తాం

కల్లూరు సర్కిల్ ఎస్ఈ వాసంతి

సాగర్ డ్యాంలో పుష్కలంగా వరదనీరు చేరటంతో డ్యాంలో నీటి సామర్థ్యం క్రమ, క్రమంగా పెరుగుతోందని ఇక సాగునీటి సరఫరాకు ఎలాంటి ఇబ్బందిలేదని కల్లూరు సర్కిల్ ఎస్ఈ వాసంతి చెప్పారు. ఇప్పటికే సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు వస్తున్నాయన్నారు. దీనికి తోడుగా సాగర్ ప్రాజెక్టు డ్యాం నీటిమట్టం పెరుగుతోందని, మరికొద్ది రోజుల్లో పూర్తిస్థాయి నీటి మట్టంతో సాగర్ డ్యాం కళకళలాడుతుందని అన్నారు. ఈ ప్రాంత ఆవశ్యకతను పరిగణలోకి తీసుకొని పాలేరు దిగువ నుంచి సాగు నీటి సరఫరా సామర్థ్యం పెరుగుతుందని ఎస్ఈ వాసంతి విలేకరులకు తెలిపారు.

నేడు, రేపు జిల్లాలో మంత్రి తుమ్మల పర్యటన



ఖమ్మం కలెక్టరేట్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శని, ఆదివారాల్లో ఖమ్మం జిల్లాలో పర్యటించనున్నారు. శనివారం మధ్యాహ్నం 2గంటలకు హైదరాబాద్‌లో బయల్దేరనున్న తుమ్మల సాయంత్రం 5గంటలకు ఖమ్మం చేరుకుంటారు. 5గంటలకు మూడో డివిజన్‌లోని అరుణాచల్ నగర్‌లో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేస్తారు. బల్లేపల్లి వద్ద సీసీ రోడ్లకు, రెయిన్‌బో నగర్ ఎస్సీ కాలనీలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలకు, బల్లేపల్లి నుంచి బైపాస్‌రోడ్డుకు రోడ్డు ఫార్మేషన్‌కు శంకుస్థాపన చేస్తారు. ఇక ఆదివారం ఉదయం 9గంటలకు రోటరీనగర్‌లో సీసీ రోడ్లు, డ్రెయినేజీలకు శంకుస్థాపన చేస్తారు. 9.30కి ఖమ్మంలో ఓ ప్రైవేటు కార్యక్రమంలో, ఉదయం 11గంటలకు తల్లాడ మండలం బిల్లుపాడులో జరిగే ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరవుతారు.

31 వరకు దోస్త్ స్పెషల్ ఫేజ్ అడ్మిషన్లు

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ ప్రథమ సంవత్సరంలో చేరడానికి దోస్త్ 2025 అడ్మిషన్ల ప్రక్రియలో భాగంగా ఈ నెల 31వరకు దరఖాస్తులు చేసుకోవటానికి వెబ్ ఆప్షన్లకు ప్రత్యేక అవకాశం కల్పించిందని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జాకీరుల్లా తెలిపారు. ఇప్పటికే రిజిస్ట్రేషన్ చేసుకోని సీటు రాని వారు గత మూడు విడతల్లో దరఖాస్తు చేయని వారు ఈ స్పెషల్ ఫేజ్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

5లోపు ఓపెన్ స్కూల్ పరీక్ష ఫీజు చెల్లించాలి

ఖమ్మం ఖానాపురంహవేలి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సార్వత్రిక విద్యా పీఠం హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో 2025 సెప్టెంబరులో నిర్వహించే ఓపెన్‌స్కూల్ పది, ఇంటర్ పబ్లిక్ పరీక్షల ఫీజు చెల్లించడానికి జూలై 27 నుంచి ఆగస్టు 5 వరకు పెంచినట్టు జిల్లా విద్యాశాఖ అధికారి కె.సత్యనారాయణ, ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ పాపారావులు తెలిపారు. పదోతరగతి అభ్యర్థులు థియరీ, ప్రాక్టికల్స్‌కు పరీక్షలకు సబ్జెక్టుకు రూ.100, ఇంటర్ థియరీ, ప్రాక్టికల్స్‌కు సబ్జెక్టుకు రూ.150 చొప్పున చెల్లించాలని తెలిపారు. రూ.25 అపరాధ రుసుంతో ఆగస్టు 10 వరకు, రూ.50 అపరాధ రుసూంతో ఆగస్టు 15వరకు, తత్కాల్ స్కీమ్‌తో సాధారణ ఫీజుతో పాటు తత్కాల్ ఫీజు పదోతరగతికి రూ.500, ఇంటర్‌కు రూ. 1000లుగా చెల్లించాలని తెలిపారు.

వర్షాల రాకతో యూరియాకు డిమాండ్

- అవసరాలకు సరిపడా సరఫరా కాని ఎరువులు



ఖమ్మం, జూలై 25 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): జిల్లాలో కురుస్తున్న వర్షాలతో యూరియాకు డిమాండ్ పెరుగుతోంది. పత్తి, మొక్కజొన్న వంటి పంటలు ఎర్రబడకుండా ఉండేందుకు యూరియాను పెద్దమొత్తంలో రైతులు కొనుగోలు చేస్తున్నారు. దీంతో ఎరువుల డిమాండ్ పెరిగింది. యూరియా కావాలంటూ రైతులు క్యూలో నిల్చొని సొసైటీల ముందు పడిగాపులు కాస్తున్నారు. ఇటీవల కాలంలో జిల్లాకు ఎరువులు రాక కొంత ఆలస్యం జరగడంతో ప్రస్తుతం వస్తున్న ఎరువులు డిమాండ్‌కు తగ్గట్టుగా సరిపోవడంలేదు. జూలై నెలలో జిల్లాకు 7500మె.ట.యూరియా డిమాండ్ ఉండగా.. 4500మె.ట. ఇప్పటి వరకు వచ్చింది. ఇంకా మిగిలిన ఎరువులు రావాల్సి ఉంది. అయితే ఓడల ద్వారా ఇతర దేశాల నుంచి అలాగే గుజరాత్, తదితర ప్రాంతాల నుంచి జిల్లాకు యూరియా దిగుమతి అవుతుంది. రైళ్లలో మూడు ర్యాక్‌లు మరో రెండు మూడు రోజుల్లో రాబోతున్నాయి. జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు సొసైటీలు, డీలర్లకు డిమాండ్ ఉన్న చోట యూరియా పంపుతున్నా.. కొన్నిచోట్ల రైతులు తర్వాత దొరుకుతుందో లేదోనన్న అనుమానంతో ముందుగానే కొనుగోలు చేస్తున్నారు. అవసరం ఉన్న రైతులు కొందరయితే అవసరం లేకపోయినా కొందరు కొనుగోలు చేసి నిల్వ చేస్తున్నారు. తల్లాడ మండలం గంగదేవిపాడుకు పంపాల్సిన లారీ యూరియాను తల్లాడలో అడ్డగించి రైతులు తీసుకెళ్లడం చర్చనీయాంశంగా మారింది.చింతకాని మండలంలో కూడా ఎరువులు డిమాండ్ అధికంగా ఉంది. జిల్లా వ్యాప్తంగా 85 సొసైటీల ద్వారా 560 మంది ప్రైవేటు డీలర్ల ద్వారా విక్రయాలు జరుగుతున్నాయి. పత్తి, మొక్కజొన్న ఉన్న మండలాల్లో ప్రస్తుతం డిమాండ్ అధికంగా ఉంది. ఈ పరిస్థితిని అవకాశంగా తీసుకుని రాజకీయపార్టీలు కూడా యూరియా సమస్యను అనుకూలంగా చేసుకుని ఆందోళన సాగిస్తున్నాయి.

స్వగృహకు.. మోక్షం!

(5వ పేజీ తరువాయి)

తీసుకుంది. ఆ మేరకు ఇటీవల ప్రకటన కూడా విడుదల చేసింది. గతంలో కూడా రెండు సార్లు ప్రకటన విడుదల చేసినా కొనుగోలుకు ఎవరూ ముందుకు రాలేదు. ఈసారి ప్రభుత్వం అవసరమైతే ఉద్యోగ సంఘాలకు ఇచ్చేందుకు మొగ్గు చూపుతోంది.

రూ.70కోట్ల ఖర్చుతో..

రాజశేఖరరెడ్డి పాలనలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సంబంధించి ఖమ్మంరూరల్ మండలంలోని పోలేపల్లి వద్ద రూ.70కోట్ల వరకు ఖర్చుపెట్టి ఈ అపార్టుమెంట్లు నిర్మించారు. ఇక వ్యక్తిగత ఇళ్ల నిర్మాణానికి రఘునాథపాలెం మండలంలో సుమారు 100 ఎకరాలు గుర్తించినా తర్వాత నిర్మాణాలు చేపట్టకపోవడంతో ఆ భూమిని రద్దుచేశారు. అపార్టుమెంట్లను పూర్తి చేసి మధ్యతరగతి ఉద్యోగులకు ఇవ్వాలని, నిర్ణయించి ఒక్కొక్కరి దగ్గర అప్పట్లో మీసేవా ద్వారా రూ.3500వరకు స్వీకరించి పేర్లు నమోదు చేయించారు. ఆతర్వాత పోలేపల్లి వద్ద మొత్తం 9.22 ఎకరాల్లో 7.60లక్షల స్క్వేర్‌పీట్లతో 9ఫ్లోర్లతో ఒక్కో ఫ్లోర్‌లో 8ప్లాట్లు ఉండేలా అపార్టుమెంట్లు నిర్మించాలని నిర్ణయించారు. అందులో భాగంగా మొదట డబుల్‌బెడ్‌రూంకు సంబంధించి 288, త్రిబుల్‌బెడ్‌రూంకు 288, మొత్తం 576 ప్లాట్లు నిర్మించారు. అయితే నిర్మాణం 60శాతం మాత్రమే పూర్తయింది. ఎక్కడా ప్లాస్టింగ్ ఎలక్ట్రికల్ వర్కు, ఫ్లోరింగ్, ప్లంబింగ్ పనులు, రోడ్లు , కాంపౌండ్‌వాల్, స్విమ్మింగ్‌పూల్, డ్రింకింగ్ వాటర్ ప్లాంట్ లాంటి ఇతర సదుపాయాలు నిర్మంచాల్సి ఉన్నా ఆపనులు చేపట్టలేదు. 2008లో ప్రారంభించిన పనులు అసంపూర్తిగానే గత 15 ఏళ్లుగా అసంపూర్తిగా వదిలేశారు.

వదిలేసిన గత ప్రభుత్వం..

దివంగత రాజీవ్‌గాంధీ పేరుతో అపార్టుమెంట్లు ఉన్నందున గత పదేళ్ల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మాణ పనులను పట్టించుకోలేదు. దీంతో అవి దిష్టిబొమ్మల్లా ఉండిపోయాయి. ఒకటి, రెండుసార్లు టెండర్లకు ప్రయత్నించినా ఆటెండర్లప్రక్రియ ఫలించలేదు. పథకం ప్రారంభ సమయంలో ప్రైవేటు అపార్టుమెంట్ ధరలు తక్కువగా ఉండం, రాజీవ్ స్వగృహ ధరలు అధికంగా ఉండడంతో బుకింగ్ ప్రక్రియ అనుకున్నంతగా సాగలేదు భవనాలు నాణ్యతగా నిర్మించినా ధరల వ్యత్యాసం చూసి ప్రైవేటు అపార్టుమెంట్లకు మొగ్గుచూపారు. అలా అసంపూర్తిగా ఉన్న ఈ భవనాలను కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వేలం ద్వారా విక్రయించాలని నిర్ణయం తీసుకుంది. ఖమ్మం రూరల్ మండలం పోలేపల్లి రాజీవ్ స్వగృహ భవనాలను తమకు కేటాయించాలని గతంలో టీజీవో, టీఎన్‌జీవో, రిటైర్డ్ ఉద్యోగుల తరుపున ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దీనిపై ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సానుకూలంగా నిర్ణయం తీసుకున్నారు. ఉద్యోగ సంఘాలు కొంత ధర తగ్గించాలని సూచిస్తూ వస్తున్నాయి.

టౌన్‌షిప్ అమ్మకానికి నోటిఫికేషన్..

ప్రభుత్వం స్వగృహ కార్పొరేషన్ ద్వారా పోలేపల్లి రాజీవ్‌స్వగృహ టౌన్‌షిప్‌కు అమ్మకానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. స్క్వేర్ ఫీట్ రూ.1150గా ధర నిర్ణయించి రూ.87.41 కోట్ల అంచనాతో టెండర్లు ఆహ్వానించింది. ఇందుకోసం రూ.5కోట్లు టెండర్ డిపాజిట్‌గా నిర్ణయించారు. సెప్టెంబరు 6 సాయంత్రం 5గంటలలోపు ధరావత్ చెల్లించి లాటరీ పద్ధతి ద్వారా జరిగే టెండర్లలో పాల్గొనాలని అధికారులు సూచించారు. సెప్టెంబరు 8న ఉదయం 11:30గంటలకు పోలేపల్లి రాజీవ్ స్వగృహ వద్ద లాటరీ నిర్వహించనున్నారు. అయితే గత అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఉద్యోగ సంఘాలకు రాజీవ్ స్వగృహ ప్లాట్ల కేటాయింపుపై హామీ ఇచ్చారు. దీంతో ఉద్యోగ సంఘాలు ప్రభుత్వం నుంచి ఈప్లాట్లు తీసుకునేందుకు ఇప్పటికే సానుకూలత వ్యక్తం చేశాయి. అయితే ధర విషయంలో కొంత చర్చలు జరుగుతున్నట్టు సమాచారం. అసంపూర్తిగా ఉన్న భవనాలు పూర్తిస్థాయిలో నిర్మించాలంటే మరో 50శాతంపైగా నిధులు ఖర్చుచేయాల్సి ఉంటుంది. వ్యక్తిగతంగా కాంట్రాక్టర్లు, బిల్డర్లు రాజీవ్ స్వగృహ తీసుకునేందుకు ముందుకురావడంలేదు. ఉద్యోగులు, అధికారుల సంఖ్య అధికంగా ఉన్నందున తమ ఉద్యోగ సంఘాల సొసైటీ ద్వారా తీసుకునేందుకు ఇప్పటికే ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నట్టు తెలిసింది. ఇందుకు ప్రభుత్వం కూడా సానుకూలంగా ఉన్నట్టు తెలుస్తోంది. ఏదేమైనా ఎన్నో ఏళ్లుగా నిరుపయోగంగా ఉన్న రాజీవ్ స్వగృహకు ప్రస్తుత ప్రభుత్వం వేలం ద్వారా విక్రయానికి నిర్ణయించడంతో నిరుపయోగంగా ఉన్న రూ.కోట్ల ప్రభుత్వ ఆస్తులకు మోక్షం లభించనుంది.

ముసురేసింది..

(5వ పేజీ తరువాయి)

పాకాల కొత్తగూడ, గుండాల ప్రాంతాల నుంచి ప్రాజెక్టుకు వచ్చే నీటిని అంచనా వస్తూ గేట్లను ఎత్తుతున్నట్లు జలాశయం ఈఈ వెంకటేశ్వరరావు తెలిపారు.

గోదావరికి పెరిగిన ప్రవాహం

భద్రాచలం వద్ద నీటమునిగిన స్నానఘట్టాలు ● పర్ణశాల నారచీరలను ముంచెత్తిన వరద

మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం క్రమేపీ పెరుగుతోంది. గురువారం అర్ధరాత్రి 12 గంటలకు 20.7అడుగులున్న గోదావరి శుక్రవారం ఉదయం 6 గంటలకు 21 అడుగులకు చేరింది. 9 గంటలకు 21.6, 12 గంటలకు 23.5, 3 గంటలకు 24.6., 6 గంటలకు 25.6 అడుగులకు చేరుకోగా 7 గంటలకు 26 అడుగులకు చేరింది ఈ క్రమంలో 30అడుగులకు చేరే అవకాశం ఉన్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. కాగా భద్రాచలం గోదావరి స్నానఘట్టాలపై నుంచి నీరు ప్రవహిస్తోంది. భక్తులు, పర్యాటకులకు తెలిసేందుకు ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. కాగా చర్ల మండలంలోని తాలిపేరు ప్రాజెక్టు నుంచి ఏడు గేట్లు ఎత్తి 31 వేల క్యూసెక్కుల నీటిని దిగువన గోదావరిలోకి వదిలారు. ఎడతెరిపిలేని వర్షాలు, గోదావరి వరద కారణంగా దుమ్ముగూడెం మండలంలోని సీతవాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ క్రమంలో ప్రముఖ పుణ్యక్షేత్రం పర్ణశాల నారచీరల ప్రాంతం శుక్రవారం ముంపునకు గురైంది. సీతమ్మ వారి విగ్రహాన్ని వరదనీరు చుట్టుముట్టింది. దీంతో భక్తులు నారచీరలను దర్శించుకోకుండానే వెనుదిరిగారు.



నారచీరల వద్ద మునిగిన సీతమ్మ విగ్రహం

తాలిపేరు ప్రాజెక్టు 7 గేట్లు ఎత్తివేత

31వేల క్యూసెక్కుల నీరు విడుదల

ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంతో పాటు చర్ల మండలంలో రెండు, మూడు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు తాలిపేరు ప్రాజెక్టులోని భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. అప్రమత్తమైన అధికారులు శుక్రవారం ఉదయం ప్రాజెక్టు 7 గేట్లు ఎత్తి 31 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. భారీ వర్షాలకు ఛత్తీస్‌గఢ్, చర్ల మండలంలోని వాగులు పొంగి పొర్లుతున్నాయి. తాలిపేరు ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరుతోంది. పరిస్థితి అంచనా వేస్తున్న అధికారులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 74మీటర్లు కాగా, ప్రస్తుతం 72.75 మీటర్లుగా ఉంది.

'ఉద్యాన' సాగుకు ప్రోత్సాహం

(5వ పేజీ తరువాయి)

రైతులు అత్యధికంగా పామాయిల్ సాగును చేపట్టారు. జిల్లాలో ప్రస్తుతం 75,920 ఎకరాల్లో ఆయిల్ పాం, 23,707 ఎకరాల్లో మిరప, 12069 ఎకరాల్లో జీడిమామిడి, 7512 ఎకరాల్లో మామిడి, 1756 ఎకరాల్లో కొబ్బరి, 853 ఎకరాల్లో అరటి, 657 ఎకరాల్లో కోకో, 10236 ఎకరాల్లో వివిధ రకాల కూరగాయలు, 226 ఎకరాల్లో జామ, 12 ఎకరాల్లో డ్రాగన్ ఫ్రూట్, 158 ఎకరాల్లో బొప్పాయి సాగవుతోంది. వీటితో పాటు ఇతర పంటలు మొత్తం 1,81,240 ఎకరాల్లో అన్నదాతు సాగు చేస్తున్నారు. ఏటేటా ఉద్యాన పంటల సాగు క్రమంగా పెరుగుతూనే ఉంది. పామాయిల్‌లో అంతర పంటగా కోకో, అరటి వంటి పంటలు వేస్తున్నారు. కొబ్బరిలో కోకోను అంతర పంటగా వేసి రైతులు లాభాలను అర్జిస్తున్నారు.

పెరిగిన రాయితీలు ఇలా..

జిల్లాలో సాగు చేసే వివిధ రకాల పంటల్లో ఐదు రకాల ఉద్యాన పంటలకు రాయితీలు పెంచారు. గత ఏడాది కంటే ఈ ఏడాది కొన్ని పంటలకు రాయితీలు భారీగా పెంచారు. ఒక్కో హెక్టారుకు రాయితీ పెంచడం జరిగింది. మామిడి పంటలకు గతేడాది వరకు హెక్టారుకు రూ.16400 రాయితీ ఇస్తుండగా.. ప్రస్తుతం దానిని రూ.50వేలకు పెంచారు. అరటి పంటకు గతేడాది రూ.40,985 రాయితీ ఇవ్వగా.. దానిని రూ.70వేలకు పెంచారు. జామకు రూ.29,332 రాయితీ ఉండగా.. దానిని రూ.50వేలకు పెంచారు. కోకో పంటకు రూ.22వేలు ఉండగా.. దానిని రూ.30వేలకు పెంచారు. డ్రాగన్ ఫ్రూట్ సాగుకు రాయితీ పెంచారు. గతంలో హెక్టారుకు రూ.1,60,000 ఉండగా.. ప్రస్తుతం రూ.2,70,000లకు పెంచారు. మల్చింగ్ విధానంలో కూరగాయలు, ఇతర ఏ పంటలు సాగు చేసినా.. గతంలో రూ.16వేలు ఇస్తుండగా, దానిని ప్రస్తుతం రూ.20వేలకు పెంచారు. ఇక అరటి, బొప్పాయి, డ్రాగన్ ఫ్రూట్ పంటలకు 2 సంవత్సరాల పాటు రాయితీ సొమ్మును రైతుల ఖాతాల్లో వేస్తారు. మామిడి, జామ, కోకో పంటలకు మూడేళ్ల పాటు రాయితీ నగదు చెల్లించడం జరుగుతుంది.

రోడ్డు దుస్థితి తెలుపుతూ చేపలు పడుతూ నిరసన

ఏన్కూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : తమ సమస్యలను పరిష్కరించాలంటూ సందర్భాన్ని బట్టి ఒక్కొక్కరు ఒక్కో రీతిలో నిరసన తెలుపుతుంటారు. ఈ క్రమంలోనే ఖమ్మంజిల్లా ఏన్కూరు మండలంలో తిమ్మారావుపేట గ్రామానికి చెందిన వారు తమ రహదారి దుస్థితిని తెలియచేసేందుకు.. రోడ్డుపై పడిన భారీ గుంతలో నిలిచిన నీటిలో గాలాలతో చేపలు పడుతూ శుక్రవారం వినూత్న నిరసన తెలిపారు. ప్రస్తుతం పడుతున్న భారీ వర్షాలతో గ్రామంలోని ఆర్అండ్‌బీ రహదారి.. కుంటను తలపిస్తోందని, ఈ ప్రధాన రహదారిని బాగు చేయాలని వారు కోరారు. ఈ విషయమై అనేకసార్లు ఆర్అండ్‌బీ అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేదంటూ మండిపడుతున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు శాశ్వత మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.



తిమ్మారావుపేట ప్రధాన రహదారిపై చేపలుపడుతూ నిరసన తెలుపుతున్న గ్రామస్థులు

కేంద్ర పథకాలపై పరిశీలన

ఇల్లెందురూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై శుక్రవారం ఇల్లెందు మండలం కొమరారం, మాణిక్యారం గ్రా మపంచాయతీలో కేంద్ర బృందం పర్యటించి గ్రామస్థుల నుంచి వివరాలు సేకరించారు. అబ్దుల్ బషీర్, సాగర్ ఆధ్వర్యంలో కొమరారం, మణికార్యం గ్రామ పంచాయతీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో స్థానిక మహిళ సంఘాల సభ్యులు, రైతులతో మాట్లాడారు. కేంద్ర పథకాలైన ఉపాధి హామీ, పోడు పట్టాలు, రేషన్, అంగన్‌వాడీల పనితీరు, డ్వాక్రా సంఘాల అభివృద్ధి రైతులకు అందుతున్న రాయితీలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ దన్‌సింగ్, ఎంపీఓ చిరంజీవి, ఏపీఎం దుర్గారావు, ఏపీఓ శంకర్, ఏఓ సతీష్, పంచాయతీ కార్యదర్శులు కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మనస్పర్థలతో దంపతుల ఆత్మహత్యాయత్నం

- తొలుత భార్య.. ఆ తర్వాత భర్త
- చికిత్స పొందుతూ భార్య మృతి
- ఖమ్మం సారథినగర్‌లో ఘటన

ఖమ్మం క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఇద్దరి మధ్య ఏర్పడిన మనస్పర్థలతో ఆ దంపతులు ఎలుకల మందు తిని ఆత్మహత్యాయత్నం చేయగా.. భార్య మృతిచెందింది. ఆ భర్త ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. శుక్రవారం ఖమ్మం నగరంలోని సారథినగర్‌లో జరిగిన ఈ సంఘటనపై ఖమ్మం త్రీ టౌన్ పోలీసు స్టేషన్లో కేసు నమోదైంది. దీనికి సంబంధించి బాధిత కుటుంబసభ్యులు, ఇన్‌స్పెక్టర్ మోహన్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం... కామేపల్లి మండలం పాతలింగాల గ్రామానికి చెందిన దొప్ప వెంకటేశ్వర్లు.. ఖమ్మం నగరం సారథినగర్‌లో 20ఏళ్లుగా నివసిస్తున్నాడు. ఆయన కుమార్తె మౌనిక (24), వారి స్వగ్రామమైన పాతలింగాలకు చెందిన మధ్యాన్నపు సాయితరుణ్ ప్రేమించుకున్నారు. నాలుగేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకుని సారథినగర్‌లోనే మరో ఇంట్లో నివసిస్తున్నారు. సాయితరుణ్ గ్రానైట్ వర్కర్‌గా, మౌనిక ప్రైవేట్ స్కూల్లో టీచర్‌గా పనిచేస్తున్నారు. వీరికి రెండేళ్ల కుమారుడున్నారు. కొద్దిరోజులుగా భార్యభర్త మధ్య మనస్పర్థలు పెరిగి.. గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఈనెల 16న ఖమ్మం నగరంలోని బుర్హాన్‌పురంలోని తన అమ్మమ్మ ఇంటికి వెళ్లిన మౌనిక.. తాను ఎలుకల మందు తాగానని తల్లిదండ్రులకు ఫోన్ చేసి చెప్పింది. అదే రోజున ఆమెను ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందింది. ఆమె ఆత్మహత్యాయత్నం విషయం గురించి తెలుసుకున్న సాయితరుణ్ కూడా 16వతేదీనే ఎలుకల మందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటనకు సంబంధించి మృతురాలి తండ్రి వెంకటేశ్వర్లు తన కూతురిని భర్త సాయితరుణ్, అత్త జయమ్మ, మామ రమేష్ వరకట్నం కోసం వేధించారని, ఆ వేధింపులతోనే ఆత్మహత్య చేసుకుందని ఖమ్మం త్రీటౌన్ పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. దీంతో వారిపై వరకట్న వేధింపుల కేసు నమోదు చేశామని ఇన్‌స్పెక్టర్ తెలిపారు.



మౌనిక (ఫైల్)



ప్రకాష్‌నగర్ వద్ద మున్నేరులో వల విసురుతున్న మత్స్యకారుడు

వల విసిరి.. చేపలను వడిసి పట్టి

మున్నేరుకు వరద ప్రవాహం కాస్త తగ్గటంతో మత్స్యకారులు శుక్రవారం చేపల వేటను ప్రారంభించారు. ఖమ్మంలోని ప్రకాష్ నగర్ వంతెన సమీపంలో ఇలా కొందరు వలలు విసిరి చేపలను వడిసి పట్టారు.

ఫొటోలు : 'ఆంధ్రజ్యోతి' స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఖమ్మం



గిరిజన విద్య బలోపేతానికే.. ఉద్దీపకం వర్క్ బుక్

ఐటీడీఏ పీవో రాహుల్

బూర్గంపాడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): గిరిజన చిన్నారుల విద్యను బలోపేతం చేసేందుకే 'ఉద్దీపకం వర్క్ బుక్'లు ప్రవేశ పెట్టినట్టు ఐటీడీఏ పీవో బి.రాహుల్ తెలిపారు. ఉపాధ్యాయులు ప్రత్యేక బాధ్యత తీసుకొని విద్యార్థులు తెలుగు, ఇంగ్లీష్ మాధ్యమాల్లో తప్పులేకుండా సక్రమంగా రాసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. శుక్రవారం బూర్గంపాడు మండలం సారపాక గ్రామ పంచాయతీలో గల భాస్కర్ నగర్, రాజీవ్‌నగర్ గిరిజన సంక్షేమ శాఖ జీపీఎస్ పాఠశాలలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడి పాత్ర నిర్వహించి పిల్లల చేత బోర్డుపై అక్షరమాల, వారి తల్లిదండ్రుల పేర్లను రాయించారు. వారు సరిగ్గా రాయడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పీవో రాహుల్ మాట్లాడుతూ.. జీపీఎస్ పాఠశాలలో చదివే పిల్లల విద్యాభ్యాసం పునాది నుంచి పటిష్ఠంగా ఉండేలా ఉద్దీపకం వర్క్ బుక్‌ను ప్రవేశపెట్టినట్టు తెలిపారు. చాలా వరకు పిల్లలు అందులోని పదాలు, కూడికలు, తీసివేతలు, ఇతర వస్తువుల పేర్లు అర్థం చేసుకొని రాయగలుగుతున్నట్టు చెప్పారు. అయినా ఇంగ్లీష్ పదాలను అక్కడక్కడ తప్పులు రాస్తున్నారన్నారు. అందువల్ల అక్షరమాలకు సంబంధించిన అక్షరాలను పిల్లలందరూ తప్పులేకుండా రాసేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని పీవో సూచించారు. సంబంధిత ఎస్‌సీఆర్‌పీల పర్యవేక్షణ సక్రమంగా ఉండాలన్నారు. ఉద్దీపకం బుక్‌లోని అంశాలను ఉపాధ్యాయులు పిల్లలకు బోధిస్తున్నది.. లేనిది.. అన్న విషయాన్ని గమనించాలన్నారు. భాస్కర్‌నగర్ జీపీఎస్ పాఠశాలలో 50మంది పిల్లలు ఉన్నా.. అక్కడ పని చేస్తున్న టీచర్ రాజ్యలక్ష్మీ ఉద్దీపకం వర్క్‌బుక్‌లోని పదాలను పిల్లలకు అర్థమయ్యేలా బోధిస్తున్న తీరును చూసి, సదరు టీచర్‌ను పీవో రాహుల్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సీఆర్‌పీ శ్రీదేవి, ఉపాధ్యాయులు మంగమ్మ, రాజ్యలక్ష్మి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.



పిల్లలతో మాట్లాడుతున్న పీవో

జిల్లా మహాసభలకు 'పేట' ముస్తాబు

నేడు, రేపు నిర్వహణ ఏర్పాట్లు పూర్తి
తరలిరానున్న జాతీయ, రాష్ట్ర నేతలు

అశ్వారావుపేట రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ మూడో జిల్లా మహాసభలకు భద్రాద్రి కొత్తగూడెంలోని అశ్వారావుపేట వేదికైంది. రెండు రోజుల పాటు (శని, ఆదివారం) జరిగే ఈ మహాసభలకు భద్రాచలం రోడ్‌లోని శ్రీశ్రీ కల్యాణ మండపం ముస్తాబైంది. అమర జీవి సయ్యద్ మియాజానీనగర్‌లో కామ్రేడ్ పోటు ప్రసాద్, బండెల నర్సయ్య, ఏపూరి బ్రహ్మం, యార్లగడ్డ భాస్కరరావు పేర్లమీద ఈ మహాసభల ప్రాంగణాలకు నామకరణం చేశారు. ఈ మహాసభలు ప్రజా పోరాటాలకు, భూపోరాటాలకు, ప్రగతిశీల భావాలకు నిలయంగా ఉన్న అశ్వారావుపేటలో భవిష్యత్ ఉద్యమాల రూపకల్పనకు, రానున్న మూడేళ్ల పాటు చేపట్టే పనుల కార్యాచరణ కోసం వేదికగా నిలవనున్నాయి. ఈ సభలకు జాతీయ, రాష్ట్ర, ఉమ్మడిజిల్లా స్థాయి నేతలతో పాటు సుమారు 700 మంది డెలిగేట్స్ పాల్గొననున్నారు. వారిలో జాతీయ కార్యదర్శి నారాయణ, సీనియర్ నాయకులు పువ్వాడ నాగేశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఎమ్మెల్సీ రాష్ట్రనాయకులు నెల్లికంటి సత్యం, బాగం హేమంతరావు, అయోధ్య, జిల్లా కార్యదర్శి సాబీర్ పాషాతో తదితరులు పాల్గొంటారని స్థానిక నాయకుడు సయ్యద్ సలీం తెలిపారు. మహాసభల సందర్భంగా రాజకీయ, ఆర్థిక, సామాజిక అంశాలు, స్థానిక సమస్యలకు సంబంధించిన 39 తీర్మానాలు ప్రవేశ పెట్టనున్నారని తెలిపారు.



జిల్లా మహాసభల సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు

ముస్తాబైన అశ్వారావుపేట

సీపీఐ మహాసభల సందర్భంగా అశ్వారావుపేటను ఆ పార్టీ నాయకులు అందంగా ముస్తాబు చేశారు. పార్టీ తోరణాలతో రింగ్‌రోడ్ సెంటర్‌ను ఎరుపుమయం చేశారు. మహాసభలు విజయవంతం చేయాలని కోరుతూ పట్టణంలో భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. భద్రాచలం రోడ్, సత్తుపల్లి, జంగారెడ్డిగూడెం రోడ్‌లో పార్టీ జెండాలను, తోరణాలను కట్టారు. ఈ మహాసభలకు శ్రేణులు భారీగా తరలిరావాలని ఆహ్వాన సంఘం బాధ్యులు సయ్యద్ సలీం, నరాటి ప్రసాద్ తెలిపారు.

ప్రజాసమస్యలపై నిరంతర పోరాటం

అశ్వారావుపేట మహాసభల్లో 39 తీర్మానాలు
'సీతారామ' ద్వారా ప్రతీ మండలానికి నీరందించాలి
పెదవాగు ప్రాజెక్టుపై రెండు రాష్ట్రాలు దృష్టిసారించాలి
సీపీఐ భద్రాద్రి జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా

అశ్వారావుపేట రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సీపీఐ ప్రజల పక్షాన నిరంతరం పోరాటాలు చేస్తూనే ఉంటుంది. అశ్వారావుపేటలో శని, ఆదివారాల్లో జరిగే జిల్లా మూడో మహాసభల్లో పలు ప్రజాసమస్యలు, జిల్లా అభివృద్ధికి సంబంధించిన డిమాండ్లతో 39 తీర్మానాలు చేస్తామని సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్ పాషా తెలిపారు. శుక్రవారం అశ్వారావుపేటలోని మహాసభల ప్రాంగణం వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. మహాసభల తొలిరోజు పార్టీ పతాకాన్ని సీనియర్ నాయకుడు పువ్వాడ నాగేశ్వరరావు ఆవిష్కరిస్తారన్నారు. సీపీఐ ఎప్పుడూ పేదల పక్షంగానే ఉంటుందని అశ్వారావుపేటలో పేదలకు పార్టీ ద్వారా 800మందికి ఇళ్ల స్థలాలు ఇచ్చామన్నారు. ఇప్పటికీ జిల్లాలో సీపీఐ బలమైన పార్టీగా ఉందని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ విజయం సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. భద్రాద్రి జిల్లాలో పారే గోదావరి జలాలతో నిర్మించిన సీతారామ ప్రాజెక్టు నుంచి అన్ని మండలాలకు సాగు నీరందించాలని కోరారు. రెండు రాష్ట్రాల మధ్య నలుగుతున్న పెదవాగు ప్రాజెక్టుపై దృష్టిసారించి నిధులు విడుదల చేయాలన్నారు. ప్రాజెక్టుకు గత ఏడాది గండి పడటం ద్వారా ఇప్పటికీ దాదాపు 2,500 ఎకరాల్లో వరిపంట వేసే అవకాశం లేకుండా పోయిందని, తక్షణమే పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయాలని కోరారు. అశ్వారావుపేట నుంచి సరైన రవాణా సౌకర్యాలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, బస్టాండ్, పోలీస్ సబ్ డివిజన్ కార్యాలయం, రెవెన్యూ డివిజన్ కార్యాలయం, ఉద్యాన విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేయాలని మహాసభల్లో తీర్మానాలు చేస్తామన్నారు. సమావేశంలో అశ్వారావుపేట నియోజకవర్గ కార్యదర్శి సయ్యద్ సలీం, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నారాటి ప్రసాద్, జిల్లా నాయకులు గన్నిన రామకృష్ణ, మల్లికార్జున్, రాహుల్, విజయ్‌కాంత్, రజ్వి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి సాబీర్‌పాషా

డిజిటల్ అరెస్టు పేరుతో భద్రాద్రి వైద్యుడికి బెదిరింపులు

భద్రాచలం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): భద్రాచలానికి చెందిన ప్రముఖ నేత్ర వైద్య నిపుణుడు డాక్టర్ నారాయణను సైబర్ నేరగాళ్లు బెదిరించిన సంఘటన ఇది. గురువారం ఉదయం 11 గంటల సమయంలో డాక్టర్ నారాయణకు కొందరు వ్యక్తులు వీడియోకాల్ చేసి.. 'మేం బెంగళూరు పోలీసులం అంటూ.. మీ పేరుతో బెంగళూరులో 17 కేసులు నమోదయ్యాయి. మిమ్మల్ని విచారించేందుకు డిజిటల్ అరెస్టు చేస్తున్నాం. మీరున్న గదిలోనే ఉండాల్సి ఉంటుంది' అని చెప్పారు. దీంతో కంగారు పడిన నారాయణ వారు చెప్పినట్లుగానే.. 4గంటల పాటు గదిలోనే ఉన్నట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో సదరు సైబర్ నేరగాళ్లు 'మీ ఆధార్‌తో ఉన్న మరో సిమ్‌ను చట్టవ్యతిరేక పనులకు వాడారు. బెంగళూరు వచ్చి పోలీసులను కలవాలి' అని బెదిరింపులకు పాల్పడ్డారు. దాంతో కంగారు పడిన నారాయణ కుటుంబసభ్యులు, కుమారుడికి విషయం చెప్పడంతో అది సైబర్ నేరగాళ్ల పనేనని చెప్పినట్లు సమాచారం. అలాగే సాయంత్రం 6 గంటల తరువాత కూడా మళ్లీ మళ్లీ ఫోన్లు వస్తున్నా నారాయణ స్పందించలేదని తెలుస్తోంది. ఈ విషయమై భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్‌కుమార్‌సింగ్‌ను 'ఆంధ్రజ్యోతి' సంప్రదించగా ఈ ఘటన మా దృష్టికి వచ్చిందని, విచారిస్తున్నామని తెలిపారు.

ఖమ్మం ఆర్డీవో ఆఫీసులో కంప్యూటర్లు జప్తు

'బైపాస్' పరిహారం విషయంలో జిల్లా కోర్టు ఉత్తర్వులు

ఖమ్మంలీగల్, జూలై 25(ఆంధ్రజ్యోతి): 39ఏళ్ల క్రితం ఖమ్మం బైపాస్‌రోడ్డు నిర్మాణానికి సంబంధించి రెవెన్యూ అధికారులు భూ సేకరణ చేశారు. కానీ నిర్వాసితులకు పరిహారం చెల్లించే విషయంలో వారు నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఘటనపై జిల్లా కోర్టు ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రస్తుత ఆర్డీవో ఆఫీసులోని కంప్యూటర్లను జప్తు చేశారు. ఈ సంఘటన శుక్రవారం ఖమ్మంలో జరిగింది. 1986లో ఖమ్మంనగరంలో బైపాస్‌రోడ్డు కోసం నాడు రెవెన్యూ అధికారులు భూసేకరణ చేశారు. దానికి సంబంధించి 2007లో గజానికి రూ.400చొప్పున ధరనిర్ణయించిన నాటి ఖమ్మం ఆర్డీవో నిర్వాసితులకు సొమ్ము చెల్లించారు. కానీ తమకు పరిహారం తక్కువగా వచ్చిందంటూ సూరపనేని స్వర్ణ అనే మహిళ ఖమ్మం జిల్లా కోర్టును ఆశ్రయించారు. తనకు 1740గజాలకు పరిహారం పెంచి ఇవ్వాలని కేసు దాఖలు చేయగా.. గజానికి రూ.2500చొప్పున చెల్లించాలని 2021లో కోర్టు తీర్పునిచ్చింది. ఆ తీర్పుపై ప్రభుత్వం హైకోర్టుకు అప్పీలు చేయగా దాన్ని కొట్టివేసిన హైకోర్టు గజానికి రూ.6వేల చొప్పున ఇవ్వాలని తీర్పుచెప్పింది. హైకోర్టు ఉత్వర్వుల ప్రకారం ఇంకా 50శాతం చెల్లించాల్సి ఉందని, మూడేళ్లయినప్పటికి ఇప్పటి వరకు పరిహారం చెల్లించలేదంటూ ఫిర్యాదుదారు గురువారం ఖమ్మం జిల్లా కోర్టులో ఎగ్జిక్యూషన్ పిటీషన్ వేయగా.. ఆర్డీవో ఆఫీసులోని సామగ్రిని జప్తుచేసి కోర్టులో డిపాజిట్ చేయాలంటూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్ శుక్రవారం ఉత్తర్వులిచ్చారు. ఆ సామగ్రిని ఆగస్టు 28న వేలం ద్వారా విక్రయించాలని ఆదేశాలు ఇచ్చారు. దీంతో ఆర్డీవో ఆఫీసులోని కంప్యూటర్లను కోర్టు సిబ్బంది జప్తుచేశారు. ఫిర్యాదుదారు తరుపున న్యాయవాదులు మానుకొండ శివకుమార్, వంజాకు లక్ష్మీనారాయణ వాదనలు వాదించారు.



జప్తు చేసి తరలిస్తున్న కంప్యూటర్లు

31లోపు ఎర్త్‌సైన్స్ కోర్సులకు దరఖాస్తు

ప్రిన్సిపాల్ జగన్‌మోహన్‌రాజు

కొత్తగూడెం ఎడ్యుకేషన్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీలో డిగ్రీ కోర్సులకు దోస్త్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని యూనివర్సిటీ ప్రిన్సిపాల్ టి.జగన్‌మోహన్‌రాజు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025-26 విద్యాసంవత్సరం నుంచే ఎర్త్‌సైన్స్ కోర్సులు ప్రారంభిస్తున్న సంగతి విదితమే. ఈ ఏడాది జియాలజీ, జియోఫిజిక్స్, జియోకెమిస్ట్రీ, జియో ఎన్విరాన్‌మెంట్ కోర్సుల్లో ఒక్కొక్క దానిలో 60 సీట్లు కేటాయించినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ నెల 31వ తేదీలోగా దోస్త్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాని తెలిపారు. త్వరలోనే పీజీ కోర్సులో అడ్మిషన్స్ జరుగుతాయని ఆగస్టు నెలలో తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు.



డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్‌సైన్స్ యూనివర్సిటీ

రైలుకింద పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి

మధిర, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రైలుకింద పడి ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం మధిరలో జరిగింది. రైల్వే పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం మధిరలోని వైరా నది రైల్వేబ్రిడ్జి వద్ద ఉదయం 9 గంటల ప్రాంతంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి రైలు ఢీకొని మృతి చెందాడని తెలిపారు. అతని వయస్సు సుమారు 46 సంవత్సరాలు ఉంటుందని, నలుపు రంగు ఛాయతో 5.6 అడుగుల ఎత్తు కలిగి ఉన్నాడని తెలిపారు. ఆ వ్యక్తి ధరించిన తెలుపు రంగు టీషర్టుపై కారు గుర్తుకే ఓటేద్దాం కందాళను గెలిపిద్దాం పాలేరు నియోజకవర్గం అని రాసి ఉందన్నారు. మృతుని ఎడమ మోకాలు నుండి పాదం వరకు తెల్లటి బ్యాండేజి ధరించాడని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మధిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మధిర రైల్వే హెడ్ కానిస్టేబుల్ వేణుగోపాలరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

వృద్ధురాలిపై అత్యాచారయత్నం

కేసు నమోదు చేసిన పోలీసులు

బూర్గంపాడు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలిపై అత్యాచారయత్నానికి యత్నించిన ఘటనపై శుక్రవారం బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. పాల్వంచ బస్టాండ్ సమీపంలో భిక్షాటన చేసుకుంటూ జీవనం సాగిస్తున్న మణుగూరుకు చెందిన ఓ వృద్ధురాలిని శుక్రవారం తెల్లవారుజామున ఓ ఆటో డ్రైవరు మాటలు కలిపి తన ట్రాలీఆటోలో ఎక్కించుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో ఆటో డ్రైవరు బూర్గంపాడు మండల పరిధిలోని సారపాక శివారులో గల పల్లెప్రకృతి వనం సమీపంలో ఉన్న అటవీ ప్రాంతంలోకి ఆటోను తీసుకెళ్లి ఆమెను బలాత్కరించేందుకు ప్రయత్నించాడు. దీంతో ఆమె తప్పించుకుని ప్రధాన రహదారి పైకివచ్చి అటుగా వెళ్తున్న వాహనంలో సారపాక చేరుకుంది. అనంతరం కుటుంబసభ్యులతో కలిసి బాధితురాలు జరిగిన ఘటనపై బూర్గంపాడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ మేడా ప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా బూర్గంపాడు, పాల్వంచ మండలాల పరిధిలోని పలు సీసీ కెమెరాలను పరిశీలించి ఆధారాలు సేకరించినట్లు ఎస్‌ఐ తెలిపారు. అలాగే పాల్వంచలోని ఓ కాలనీకి చెందిన వ్యక్తిని అనుమానితుడిగా అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

మనస్తాపంతో కేటీపీఎస్ కార్మికుడి ఆత్మహత్య

పాల్వంచ, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : అనారోగ్యంతో బాధపడుతున్న కేటీపీఎస్ కార్మికుడు మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న ఘటన పాల్వంచలో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం పాల్వంచ కేటీపీఎస్ కర్మాగారంలో ఫోర్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్న ముళ్ళపూడి రామ్‌నీల్ ప్రసాద్ (48) కేటీపీఎస్ కాంప్లెక్స్‌లోని ఎఫ్ టైప్ క్వార్టర్‌లో నివాసం ఉంటున్నాడు. గత కొంతకాలంగా మద్యానికి బానిసవడంతో అతని ఊపిరితిత్తులు పూర్తిగా దెబ్బతిన్నాయి. దీంతో కుటుంబసభ్యులు చికిత్స చేయిస్తున్నారు. అతని ఊపిరితిత్తులు పూర్తిగా పాడయ్యాయని తెలిసినప్పటి నుంచి అతను మానసికంగా కృంగిపోయాడు. ఈ క్రమంలోనే తన బెడ్‌రూంలోని ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చాలా సేపటి తరువాత కుటుంబ సభ్యులు గమనించి కేటీపీఎస్ ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతి చెందాడని నిర్ధారించారు. మృతుడి భార్య స్నేహలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ ఎస్‌ఐ సుమన్ తెలిపారు.



రామ్‌నీల్ ప్రసాద్ (ఫైల్)

మస్కట్‌లో.. 'పేట' యువతి అష్టకష్టాలు

ఆంధ్రా ఏజెంట్ చేతిలో మోసపోయిన బాధితురాలు
ఉన్నత ఉద్యోగం అంటూ తరలింపు..
ఏడు ఇళ్లల్లో పని..
తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ..
యువతి సెల్ఫీ వీడియో
స్వదేశానికి వచ్చేందుకు సహకరించాలని వేడుకోలు

అశ్వారావుపేట రూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఉన్నత విద్యనభ్యసించిన ఓ యువతి కుటుంబ ఆర్థిక పరిస్థితి నేపథ్యంలో.. ఓ మహిళా ఏజెంట్ మాయమాటలు నమ్మి ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశమైన మస్కట్‌కు వెళ్లి మోసపోయిన ఘటన ఇది. ఆమెకు అక్కడ ఉపాధి దొరకడం సంగతి అటుంచితే.. ఆ యువతి వెట్టి చాకిరీ చేస్తూ నానా కష్టాలు పడుతూ.. సరైన తిండి కూడా లేక.. తీవ్ర అనారోగ్యం పాలైంది. చివరకు దేశంలో కాని దేశంలో ఆస్పత్రి పాలై తనను రక్షించాలంటూ సెల్ఫీ వీడియో ద్వారా వేడుకుంటోంది.

బాధితురాలి కథనం ప్రకారం..

ఆంధ్రాలోని కొవ్వూరు ప్రాంతమైన కుమారదైవం గ్రామానికి చెందిన కొయ్య పోసియ్య, మేరీ దంపతులు గత 25ఏళ్ల క్రితం బతుకుతెరువు కోసం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేటకు వచ్చారు. ఈ దంపతులకు కావ్య అనే కూతురు ఉంది. అరటి ఆకులను రవాణా చేసే పోసియ్య రెండేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో కుటుంబ పోషణ కావ్యపై పడింది. ఆమె కొంతకాలం స్థానికంగా పలు దుకాణాల్లో పని చేసింది. ఈ క్రమంలోనే కావ్యకు ఆంధ్రాలోని తాళ్లపుడి మండలం అన్నదేవరపేటకు చెందిన ఓ మహిళా ఏజెంట్ పరిచయమైంది. తన ఆర్థిక పరిస్థితిని వివరించగా.. తాను మస్కట్‌కు పంపుతానని, మంచి జీతం, వసతి ఉంటుందని, ఆర్థిక ఇబ్బందులు కూడా తీరుతాయని నమ్మబలికింది. ఇందుకు మొదట్లో ఇష్టపడని యువతి.. ఆ తర్వాత ఫోన్ చేయగా ఒమన్ దేశంలోని మస్కట్‌లో ఓ వృద్ధ దంపతులకు సేవ చేస్తే నెలకు రూ.40 వేల వరకు ఇస్తారని, అయితే అక్కడికి వెళ్లేందుకు రూ.3 లక్షల వరకు ఖర్చు అవుతుందని, అవి తానే భరిస్తానని తెలిపింది. దీంతో ఏజెంట్ మాటలు నమ్మిన కావ్య మూడు నెలల క్రితం మస్కట్‌కు వెళ్లింది.



వీడియోలో రోదిస్తున్న యువతి కావ్య

ఇబ్బందులు పడుతున్నట్లు 'సెల్ఫీ' వీడియో..

ఏజెంట్ మాటలు నమ్మి మస్కట్‌కు వస్తే.. ఒక ఇంట్లో కాకుండా అపార్ట్‌మెంట్‌లో ఉన్న ఏడు ఇళ్లల్లో పనులు చేయిస్తున్నారని రెండు రోజుల క్రితం సెల్ఫీ వీడియో ద్వారా కావ్య ఆవేదన వ్యక్తం చేసింది. తాను అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతుంటే కనీసం వైద్యం కూడా చేయించడం లేదని ఆరోపించింది. తాను రోగంతో ఇక్కడే చనిపోతానేమో అంటూ కన్నీళ్లు పెట్టుకుంటూ తన తల్లికి, బంధువులకు వీడియో తీసి పంపింది. పైగా తను చేసిన పనికి జీతం కూడా ఇవ్వడం లేదని వాపోయింది. ఈ విషయాన్ని తనను పంపిన మహిళా ఏజెంట్‌కు చెబితే.. తనకేమీ సంబంధం లేదని ఎదురుదాడికి దిగి దుర్భాషలాడుతున్నట్లు తెలిపింది. తాను పడుతున్న ఇబ్బందులను భారత ఎంబసీకి ఫోన్ చేసి ఫిర్యాదు చేయగా.. మరింతగా వేధింపులకు గురిచేస్తున్నారని కావ్య వాపోయింది. తీవ్ర వేధింపులకు గురై.. అనారోగ్యం బారిన పడిన తనను వెంటనే అశ్వారావుపేటకు తీసుకురావాలని యువతి ప్రభుత్వాన్ని వేడుకుంది.



తల్లి మేరీతో కావ్య

'పంపడం వరకే మా పని..'

అనారోగ్యంతో బాధపడుతున్న తన కూతురి పరిస్థితి తెలుసుకుని కావ్య తల్లి మేరీ అన్నదేవరపేటకు వెళ్లి మహిళా ఏజెంట్‌ను కలిసి ఆమె దీనస్థితిని వివరించింది. దీనికి పంపడం వరకే తనపనని, తీసుకురావడం సంబంధం లేదని చెప్పినట్లు కావ్య తల్లి మేరీ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపింది. ఈ విషయమై తాళ్లపుడి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. ఇప్పటికే తన కూతురు మస్కట్‌లో అనేక రకాలుగా వేధింపులకు గురవుతోందని, అధికారులు తక్షణమే స్పందించి కావ్యను ఇక్కడకు తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకోవాలని మేరీ కోరారు.

గర్భం దాల్చిన మానసిక వికలాంగురాలు

బాధితురాలి వయస్సు తేల్చే పనిలో ఉన్న అధికారులు
దుమ్ముగూడెం మండలం ఓ ఆదివాసీ గ్రామంలో ఘటన
ఘటనపై పోలీసులకు అందని ఫిర్యాదు

దుమ్ముగూడెం, జూలై 25 (ఆంధ్రజ్యోతి): దుమ్ముగూడెం మండలంలోని నరసాపురం ఐసీడీఎస్ సెక్టార్ పరిధిలోని ఓ ఆదివాసీ గ్రామానికి చెందిన అభం శుభం తెలియని మానసిక వికలాంగురాలు గర్భం దాల్చిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. తండ్రితో కలిసి ఉంటున్న ఆ బాధితురాలు ప్రస్తుతం ఎనిమిదో నెల గర్భిణి కాగా.. కొద్ది రోజుల క్రితం ఆమె కడుపునొప్పితో బాధపడుతుండగా, తండ్రి నరసాపురం పీహెచ్‌సీలో పరీక్షలు చేయించారు. దీంతో ఆమె గర్భవతి అని వైద్యసిబ్బంది తేల్చారు. ఆమె తల్లి తన చిన్నతనంలోనే తండ్రి నుంచి విడాకులు తీసుకుందని సమాచారం. ప్రస్తుతం బాధితురాలు తండ్రితో కలిసి ఉంటోంది. ఈ విషయం తెలిసిన చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, ఐసీడీఎస్, పోలీసు అధికారులు గ్రామంలో ఇప్పటికే వివరాలు సేకరించినట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆమెను ఖమ్మంలోని అన్నం ఫౌండేషన్‌కు అప్పగించేందుకు అధికారులు యత్నిస్తున్నారు. ఎవరి మీద అనుమానం లేదని యువతి తండ్రి అంటుండగా.. ఆమె గర్భం దాల్చడం మాత్రం మిస్టరీగా మారింది. కేసు పెట్టడానికి నమోదుకు కూడా యువతి తండ్రి ఇష్టపడక పోవడంతో పలు అనుమానాలకు తావిస్తోంది.

బాధితురాలి వయస్సు తేల్చే పనిలో అధికారులు

అసలు ఆ యువతి వయసెంత? మేజరా? మైనరా? అనే విషయం తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నారు. యువతి నిరక్షరాసురాలు కావడంతో వయస్సు తేల్చడం ఒకింత కష్టంగా మారింది. అంగన్వాడీ రిజిష్టరులో పుట్టినతేదీ 2006 అని, ఆధార్‌కార్డులో 2009గా నమోదై ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఒకవేళ మైనర్ అయి ఉంటే బాలల సంక్షేమ శాఖ కమిటీ, మేజర్ అయితే బాధితురాలి తండ్రి ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. సదరు ఆ యువతి సెప్టెంబర్ నెలలో ప్రసవిస్తుందని డాక్టర్లు పేర్కొన్నారని తెలిపారు. పోలీసు కేసు పెడితే ఆమెను మానసిక వైకల్యం కలిగిన రోగుల ఆసుపత్రికి తరలించాల్సి ఉంది. కానీ జిల్లా చుట్టుపక్కల అలాంటి సదుపాయం లేకపోవడంతో అధికారులకు ఏంచేయాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. ఇంట్లో కేవలం తండ్రి, కూతురు ఇద్దరు మాత్రమే నివసిస్తుండగా, గర్భానికి కారకులెవరనేది ప్రశ్నార్థకంగా మారింది. ఈ విషయమై సీడీపీవో జ్యోతిని వివరణ కోరగా, కేసు పెట్టడానికి తండ్రి ముందుకు రావడం లేదని తెలిపారు. రేడియేషన్ సమస్యతో వయస్సు నిర్ధారణ పరీక్షలు చేయడం లేదన్నారు. ప్రస్తుతానికి బాధితురాలిని ఖమ్మంలోని అన్నం ఫౌండేషన్‌కు తరలిస్తున్నామని తెలిపారు.

ముగ్గురు సైబర్ నేరగాళ్ల అరెస్టు

ఖమ్మం క్రైం, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరగాళ్లు డిజిటల్ అరెస్టులంటూ కొత్తపంథాలో మోసాలు పాల్పడుతున్నారు. ఖమ్మం మండలం నేతాజీనగర్‌కు చెందిన రిటైర్డ్ ఉద్యోగిని బెదిరించి డిజిటల్ అరెస్టు చేసి రూ.59 లక్షలు మోసం చేసిన కేసులో ముగ్గురిని ఖమ్మం సైబర్ క్రైం పోలీసులు శుక్రవారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపురంలో అరెస్టు చేసినట్లు ఖమ్మం సి.పి. సునిల్‌దత్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం బెంగళూరు పోలీసులమంటూ నేరగాళ్లు ఖమ్మం అర్బన్ మండలానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయుడుకి ఫోన్ చేసి జాబ్ ఫ్రాడ్స్, మనీలాండరింగ్‌కి పాల్పడ్డారని, డిజిటల్ అరెస్టు చేస్తామని బెదిరించినట్లు చెప్పారు. సైబర్ నేరగాళ్లు రిటైర్డ్ ఉపాధ్యాయుడు వద్ద నుంచి సుమారు రూ.59 లక్షలు దోచుకున్నారు. కేసులో రూ.9 లక్షలు డి.యెర్రిస్వామి (35) అకౌంట్‌లోకి వెళ్లడంతో అతనిని అరెస్ట్ చేసి విచారించగా.. మరో ఇద్దరు నేరగాళ్లు అయిన లక్మానాయక్ (35) కె.నారాయణ రెడ్డి (49) కలిసి నేరం చేసినట్లు ఒప్పుకున్నారు. దీంతో ఆ ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ముగ్గురు నిందితులను ఖమ్మం సైబర్ క్రైం కోర్టులో హాజరు పరచి, రిమాండ్‌కి తరలించామని తెలిపారు. సైబర్ క్రైం ఇన్‌ఛార్జి డీఎస్పీ టి.లక్ష్మీనారాయణ, ఇన్‌స్పెక్టర్ యాసిన్ అలీ, ఎస్సైలు రంజితకుమార్, సహకరించిన ఎస్సై విజయ్‌కుమార్, సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్ సిబ్బందిని ఖమ్మం సీపీ అభినందించారు.

చెక్కుబౌన్స్ కేసులో క్రిమినల్ అప్పీల్ కొట్టివేత

కొత్తగూడెం లీగల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : చెక్‌బౌన్స్ కేసులో క్రిమినల్ అప్పీలను కొట్టివేస్తూ జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ శుక్రవారం తీర్పు వెల్లడించారు. పాల్వంచ కాంట్రాక్టర్స్ కాలనీకి చెందిన గంటింటి కృష్ణ వినాయక ఎంటర్‌ప్రైజెస్ తరపున అదే ప్రాంతానికి చెందిన మిర్యాల అలివేలు వద్ద 2011లో రూ.5 లక్షలు తీసుకుని చెల్లించలేదు. 2013లో కృష్ణ రూ.7 లక్షలకు చెక్కు ఇవ్వగా అలివేలు ఆ చెక్కు బ్యాంకులో డిపాజిట్ చేయగా బౌన్స్ అయింది. లాయర్ నోటీసులు ఇచ్చినప్పటికీ స్పందించకపోవడంతో చెక్‌బౌన్స్ కేసు దాఖలు చేశారు. విచారణ అనంతరం రెండవ అదనపు జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఎం.నీలిమా 2021లో కృష్ణ రూ.14లక్షలు చెల్లించాలని, ఒక సంవత్సరం కారాగార శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారు. ఈ క్రమంలో కృష్ణ కొత్తగూడెం జిల్లా కోర్టులో అప్పీలు దాఖలు చేసుకోగా ఇరుపక్షాల వాదన విన్న అనంతరం కింది కోర్టు తీర్పును ఖరారు చేస్తూ అప్పీలును కొట్టివేస్తూ తీర్పు వెలువడింది. అలివేలు తరపున లక్కినేని సత్యనారాయణ బృందం వాదించారు.

బాబాయిని గాయపర్చిన కేసులో అబ్బాయికి జైలు..

కొత్తగూడెం లీగల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : బాబాయిని గాయపర్చిన అబ్బాయికి కొత్తగూడెం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కే.కిరణ్‌కుమార్ శుక్రవారం జైలుశిక్ష విధించారు. 2022లో పాండురంగాపురానికి చెందిన మైనేని వెంకటేశ్వరరావు పొలంలో ఉండగా తన పెద్దనాన్న కుమారుడైన మైనేని ఉదయ్‌భాస్కర్ గతంలోని గొడవలు మనస్సులో పెట్టుకుని దాడిచేశారు. దీంతో పాల్వంచ రూరల్ పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేయగా సబ్ ఇన్‌స్పెక్టర్ కే.సుమన్ కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. 12మంది సాక్షుల విచారణ, ఇరుపక్షాల వాదనల అనంతరం మైనేని ఉదయ్‌భాస్కర్‌కు ఒక సంవత్సరం జైలుశిక్ష, రూ. 1000లు జరిమాన విధించి తీర్పు వెల్లడించారు.



ఆరుగ్యారెంటీల అమలుపై 1నుంచి నిరసనలు

ఖమ్మంసంక్షేమ విభాగం,జూలై25(ఆంధ్రజ్యోతి):ఆరుగ్యారెంటీ పథకాలను అమలు చేయాలని, ప్రభుత్వంపై వత్తిడి తీసుకొచ్చేందుకు ఏఐపీకేఎంఎస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టి ప్రభుత్వానికి సమస్యలను విన్నవిస్తామని రాష్ట్రఉపాధ్యక్షుడు గోకినేపల్లి వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శుక్రవారం రామనర్సయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సంఘం జిల్లా కమిటీ సమావేశంలో ఉద్యమ కార్యచరణను ప్రకటించారు. ఆగస్టు 1నుంచి 20వరకు గ్రామాల్లో, 21 నుంచి సెప్టెంబరు4 వరకు మండలకేంద్రాల్లో, సెప్టెంబరు 5న జిల్లా కేంద్రాల్లో ఈ కార్యక్రమాలు ఉంటాయన్నారు.ఈసమావేశంలో తిమ్మిడి హనుమంతరావు, చల్లరాజు, సోమనపల్లి వెంకటేశ్వర్లు, రెంటాల యాదగిరి, గంట శ్రీనివాసరావు, కూరాకుల నరసయ్య పాల్గొన్నారు.

మున్నేరుకు వరదలు వస్తే
ప్రజల్ని జాగ్రత్తగా తరలించాలి

- కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య
- ఎన్డీఆర్ఎఫ్ అధికారులతో సమీక్ష



ఎన్డీఆర్ఎఫ్ అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ అభిషేక్

ఖమ్మంకార్పొరేషన్, జూలై25(ఆంధ్రజ్యోతి): మున్నేరుకు వరద తీవ్రత ఏ నిమిషంలోనైనా పెరిగే అవకాశాలు ఉన్నాయని, ఎన్డీఆర్ఎఫ్ బలగాలు అప్రమత్తంగా ఉంటూ ప్రజల్ని మైదాన ప్రాంతానికి సురక్షితంగా తరలించేందుకు సిద్ధంగా ఉండాలని కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య సూచించారు. ఈ మేరకు శుక్రవారం తన చాంబర్‌లో ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ గోరవ్‌యాదవ్, ఏఎస్ఐ ఆర్ మది లేటితో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. ప్రకాష్‌నగర్ రిటైనింగ్ వాల్‌ను వివరించారు. మున్నేరు వరదలకు ఖమ్మంలో కురిసే వర్షాలు ప్రభావం ఎక్కువగా ఉండదని ఆకేరు, బుగ్గవాగు నుంచి వచ్చే వరదను కూడా ముందస్తుగా అంచనాలు వేస్తున్నామన్నారు. ప్రజలకు ఎటువంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ఎన్డీఆర్ఎఫ్ బృందాలు బాధ్యతలు నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా ఎన్డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ గోరవ్ యాదవ్ మాట్లాడుతూ ఇప్పటికే నాలుగు ప్రధానమైన బోట్లు, ఉత్తమ ప్రతిభ కలిగిన 25మంది సిబ్బంది ఉన్నారని, ఎంతటి విపత్తులైనా ఎదుర్కొనేందుకు కావాల్సిన పరికరాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.

‘విద్యాక్షేత్ర’లో వనమహోత్సవం



మొక్క నాటుతున్న వలరాజు

ఖమ్మంఖానాపురంహవేలి,జూలై25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని విద్యాక్షేత్ర పాఠశాలలో శుక్రవారం వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ కూరాకుల. వలరాజు హాజరై పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ సౌభాగ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఐటీఐలో ‘టీ గేట్‌వే’ సదస్సు

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టేకులపల్లి ప్రభుత్వ ఐటీఐలో శుక్రవారం తెలంగాణ గేట్‌వే ఫర్ అడాప్టివ్ ట్రైనింగ్ అండ్ ఎంప్లాయ్ మెంట్ (టీగేట్) అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ మోహన్‌బాబు, లేబర్ అసిస్టెంట్ కమిషనర్ పి. కృష్ణవేణి, డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వెంకన్న, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు హాజరై మాట్లాడారు. పరిశ్రమల అవసరాలు, నైపుణ్యాల్లో లోపాలు, శిక్షణ మార్గాలను వివరించారు. విద్యాసంస్థల అనుసంధానంపై పలు అంశాలను వివరించారు. వీవీసీ మోటార్స్ సంస్థ ఈ సంవత్సరం ఎలక్ట్రీషియన్, వెల్డర్, ఎలక్ట్రిక్ ఆటోమొబైల్‌ట్రేడ్(ఏటీసీ) విద్యార్థులకు నూరు శాతం ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఐటీఐతో ఒప్పందం చేసుకునేందుకు సానుకూలంగా స్పందించారు. స్థానిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తయారుచేసి, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ఒకగొప్ప నూతన ఆరంభం ఏర్పడిందని అన్నారు. అనంతరం టీగేట్ కమిటీ సభ్యులు కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లుల, గ్రానైట్ పరిశ్రమల, షుగర్ ఫ్యాక్టరీ,చాంబర్ ఆఫ్ కామర్స్, వీవీసీ మోటార్స్‌ల ప్రతినిధులు పాల్గొన్నారు.

వారంలో పీహెచ్‌సీని తరలించాలి

- వైద్యుల, సిబ్బంది డిప్యుటేషన్లు అన్నీ రద్దు
- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- నేలకొండపల్లి సీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ
- వైద్యులు అందుబాటులో లేకపోవడంపై డీఎంహెచ్‌వోపై తీవ్ర ఆగ్రహం



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ అనుదీప్

నేలకొండపల్లి, జూలై25(ఆంధ్రజ్యోతి): సీహెచ్‌సీ, పీహెచ్‌సీ కలిసి ఉండటంతో ఏ వైద్యుడు ఎక్కడ పని చేస్తున్నాడో తెలియటం లేదని, వారంలో పీహెచ్‌సీని ఇతర ప్రాంతానికి తరలించాలని కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్నం కలెక్టర్ నేలకొండపల్లి సీహెచ్‌సీని తనిఖీ చేశారు. రోగులను వైద్యం అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ సీహెచ్‌సీని సదర్శించిన సమయంలో చాలా మంది వైద్యులు అందుబాటులో లేరు. కలెక్టర్ వైద్యుల హాజరు పట్టికను పరిశీలించారు. చాలామంది వైద్యులు సెలవులో ఉన్నట్లుగా రిజిస్టర్‌లో మార్కుచేసి ఉండటంతో, వీళ్లకు సెలవులు ఎవరిస్తున్నారంటూ ప్రశ్నించారు. వెంటనే ఫోన్‌లో జిల్లా వైద్యఆరోగ్య అధికారితో మాట్లాడారు. సెలవులు ఎవరిస్తున్నారు? ఎందుకిస్తున్నారు? అంటూ ప్రశ్నించారు. డీఎంహెచ్‌ఓపై తీవ్రఆగ్రహం వ్యక్తం చేశారు.సీహెచ్‌సీలో ఇద్దరు దంత వైద్యులుండటంపై కలెక్టర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. దంత వైద్యుడికి నైట్ డ్యూటీ వేయటంపట్ల విస్మయం వ్యక్తం చేశారు. రాత్రిసమయాల్లో దంతవైద్యానికి ఎవరు వస్తారంటూ ప్రశ్నించారు.

డిప్యుటేషన్లు రద్దు

వైద్యశాలలోని హోమియో గదిలో కాంపౌండర్ ఉండటాన్ని గమనించిన కలెక్టర్ వైద్యుడేడని ప్రశ్నించగా డిప్యుటేషన్‌పై వెళ్లారని చెప్పారు. దీంతో డిప్యుటేషన్లను రద్దు చేస్తామని కలెక్టర్ అన్నారు. నేలకొండపల్లి సీహెచ్‌సీలో పని చేసే అందరు వైద్యులు డిప్యుటేషన్‌పైనే పని చేస్తుండటం గమనార్హం

పీహెచ్‌సీ తరలింపు

సీహెచ్‌సీ, పీహెచ్‌సీ కలిసి ఉండటంతో ఏవైద్యుడు ఎక్కడ పని చేస్తున్నాడో తెలియని పరిస్థితి ఉందని కలెక్టర్ అన్నారు. వెంటనే పీహెచ్‌సీని వేరే చోటకు తరలించటానికి చర్యలు తీసుకుంటామన్నారు. అక్కడే ఉన్న తహసీల్దార్‌ను వారం రోజుల్లో పీహెచ్‌సీకి వేరే భవనం చూసి తరలించాలని ఆదేశించారు. ప్రభుత్వ భవనాలు ఖాళీగా లేక పోయినా, ప్రైవేటు భవనంలోకైనా మార్చాలని ఆదేశించారు. డాక్టర్ రాజేష్, ఇతర వైద్యులు, తహసీల్దార్ ఓరుగంటి వెంకటేశ్వర్లు, ఎమ్మార్వైలు మధుసూధన్‌రావు, రవి కలెక్టర్ వెంట ఉన్నారు. అనంతరం కలెక్టర్ అనుదీప్ ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. కళాశాలలోని తరగతి గదులను పరిశీలించారు. శ్రద్ధగా చదువుకుని తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలన్నారు. ఇంటర్ విద్య జీవితంలో ముఖ్యమైందని, విద్యార్థుల గమనాన్ని నిర్దేశించేదన్నారు.

సర్జికల్ బ్లేడ్‌తో దాడి చేసిన యువకుడి అరెస్ట్

కామేపల్లి, జూలై25(ఆంధ్రజ్యోతి): సర్జికల్ బ్లేడ్‌తో నలుగురిని తీవ్రంగా యాలు పరిచిన యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. జూలై 12న కొత్త లింగాలకు చెందిన రెంటాల గోపి అదే గ్రామానికి చెందిన శ్యాంసుందర్, రాహుల్, నాగేశ్వరరావు, సాయి సర్జికల్ బ్లేడ్‌తో దాడిచేసి పారిపోయాడు. తీవ్ర గాయాలపాలైన శ్యాంసుందర్ తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు నమోదు చేశారు. కేసునమోదు అయిన 14 రోజుల తర్వాత రెంటాల గోపిని పోలీసులు అరెస్ట్ చేశారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు ర్యాంకుల ప్రదానం

ఖమ్మంస్పోర్ట్స్,జూలై25(ఆంధ్రజ్యోతి): డీఆర్ఎస్ డిగ్రీకాళాశాల ఎన్‌సీసీ విద్యార్థులకు శనివారం ఎన్‌సీసీ అధికారులు ర్యాంకులు ప్రదానం చేశారు. మనోజ్‌కుమార్, స్వర్ణజిత్, చందనకు 11 బెటాలియన్ కమాండెంట్ కల్నల్ సంజయ్ భద్ర ర్యాంకులు ప్రదానం చేశారు.

దేశీయ వ్యవసాయం నిర్వీర్యం

- రైతులను సాగుకు దూరం చేస్తున్న ప్రధాని మోదీ
- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని



మాట్లాడుతున్న రమేష్, అధ్యక్ష కార్యదర్శులుగా ఎన్నికైన నరసింహారావు, అశోక్

నేలకొండపల్లి, జూలై25(ఆంధ్రజ్యోతి): కార్పొరేట్ కంపెనీల చెప్పుచేతల్లో దేశీయ వ్యవసాయ రంగాన్ని ప్రధాని మోదీ తాకట్టు పెట్టారని తెలంగాణ రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు విమర్శించారు. ఇంటూరి అశోక్ అధ్యక్షతన శుక్రవారం రావెళ్లభవన్‌లో జరిగిన మండల రైతు సంఘం మహాసభలో మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న ఆర్థిక సంస్కరణల మూలంగా దేశీయ వ్యవసాయ రంగం పూర్తిగా నిర్వీర్యమై పోతుందన్నారు. సంఘం జిల్లా అధ్యక్షుడు మాదినేని రమేష్ మాట్లాడుతూ 2007లో యూపీఏ ప్రభుత్వ హయాంలో స్వామినాథన్ కమిషన్ వేయగా, నేటికీ స్వామినాదన్ సిఫార్సులను అమలు చేయటంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. రానున్న కాలంలో దేశంలో కార్పొరేట్ కంపెనీల వ్యవసాయం ముందుకు వచ్చి రైతు వ్యవసాయం కనుమరుగయ్యే పరిస్థితి దాపురించిందన్నారు. మహాసభలో రాష్ట్ర నాయకుడు గుడవర్తి నాగేశ్వరరావు, జిల్లా నాయకుడు కొప్పుల వెంకట్రామిరెడ్డి, నాయకులు యలమద్ది లెనిన్, ఏలూరి రంగారావు, ఇంటూరి అశోక్, ఆలగడప అంజయ్య, ఎడ్ల తిరుపారావు, ఏటుకూరి రామారావు, దండా సూర్యనారాయణ, వాసంశెట్టి నరసయ్య, దుగ్గి నర్సింహారావుతాళ్ళూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు సంఘం మండల అధ్యక్షుడిగా ఇంటూరి

తెలంగాణ రైతు సంఘం మండల అధ్యక్షుడిగా మూటాపురం గ్రామానికి చెందిన ఇంటూరి అశోక్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం నేలకొండపల్లిలో సంఘం మండల మహాసభలో మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా ఇంటూరి అశోక్, కార్యదర్శిగా చెన్నారం గ్రామానికి చెందిన రచ్చా నర్సింహారావుతో పాటుగా మరో 14మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నారు. నూతనంగా ఎన్నికైన మండల కమిటీని పలువురు నాయకులు అభినందించారు.

భక్తిశ్రద్ధలతో మొదటి శ్రావణ శుక్రవార పూజలు



గుంటుమల్లేశ్వర స్వామి ఆలయంలో సామూహిక కుంకుమ పూజ చేస్తున్న భక్తులు

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై25 (ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం శుక్రవారంతో ప్రారంభం కావటంతో తొలిరోజు భక్తులు ప్రత్యేక పూజలు,వ్రతాలు,నోములు, కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయాల్లో సామూహిక వ్రతాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. నగరంలోని స్తంభాద్రి లక్ష్మీ నరసింహస్వామి ఆలయం, గుంటుమల్లేశ్వరస్వామి ఆలయం, పర్ణశాల రామాలయం, రోటరీనగర్ రాజరాజేశ్వరి అమ్మవారి ఆలయం, భక్తాంజనేయస్వామి ఆలయం, అభయ వెంకటేశ్వరస్వామి ఆలయం తో పాటు పలు ఆలయాల్లో పూజలు నిర్వహించారు. దాతల సహకారంతో పూజాసామగ్రిని అందించారు. అమ్మవారిరూపు, పూజాసామగ్రితో వ్రతాలునిర్వహించారు. సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి.

పెన్షన్‌లో విభజన చట్టాలను రద్దు చేయాలి

- టీపీపీఆర్‌పీఏ సంఘం ఆధ్వర్యంలో జడ్పీలో నిరసన



ఖమ్మంసంక్షేమ విభాగం, జూలై25 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు అందించే పెన్షన్‌లో విభజించే చట్టాలను వెంటనే రద్దు చేయాలని టీపీపీఆర్‌పీఏ సంఘం జిల్లాప్రధాన కార్యదర్శి కళ్యాణం నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం జెడ్పీ సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. అంబేద్కర్ విగ్రహం చుట్టూ మానవహారం చేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెన్షనర్లకు కనీస పింఛన్ అమలు చేయాలని కోరారు. అక్టోబరు 10న జంతర్‌మంతర్ వద్ద ధర్నా చేస్తామని హెచ్చరించారు. గోపిచంద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున్‌రావు, శ్రీరాములు, రాజశేఖర్, నాగేశ్వరరావు, ఝాన్సీ, చిట్టెమ్మ, భారతి, ఉమాదేవి, పద్మకుమారి, ప్రతాప్, మీరాఖాన్, రామారావు, అంజనేయులు, లోకేశరరావు, వీరభద్రం, సాంబయ్య, కృష్ణమూర్తి, రామకృష్ణ, మీరా పాల్గొన్నారు.

భూ భారతి దరఖాస్తులను ఆన్‌లైన్ చేయాలి

అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

కామేపల్లి,జూలై25(ఆంధ్రజ్యోతి): భూభారతిలో స్వీకరించిన దరఖాస్తులను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం కామేపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఇటీవల నిర్వహించిన రెవెన్యూ సదస్సులో స్వీకరించిన దరఖాస్తులు పరిశీలించారు. స్వీకరించిన ప్రతి దరఖాస్తు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. భూభారతి పోర్టల్‌లో నోటీసులు జారీ చేయాలన్నారు.. భూభారతి పోర్టల్ నియమ నిబంధనల మేరకు దరఖాస్తులు పరిష్కార చర్యలు చేపట్టాలన్నారు. ఈ తనిఖీలో తహసీల్దార్ సుధాకర్, డీటీ రఫీ ఆర్‌ఐలు సక్రు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ ఎంపికలు వాయిదా

ఖమ్మంస్పోర్ట్స్, జూలై25(ఆంధ్రజ్యోతి): శనివారం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో నిర్వహించ తలపెట్టిన అథ్లెటిక్స్ జట్ల ఎంపికలు వర్షాల కారణంగా వాయిదా వేసినట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సెక్రెటరీ ఎండీ షఫీక్‌అహ్మద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికలను తిరిగి ఈనెల 30న నిర్వహించనున్నట్లు తెలిపారు.

జ్వరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలి

అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మంకలెక్టరేట్, జూలై 25(ఆంధ్రజ్యోతి): జ్వరాలపై వైద్యసిబ్బంది అప్రమత్తం చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ పి. శ్రీజ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆమె శుక్రవారం సీజనల్ వ్యాధుల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. సీజనల్ వ్యాధుల వ్యాప్తి అరికట్టేందుకు పారిశుధ్య నిర్వహణ చాలా కీలకమన్నారు. మండలంలో వైద్య అధికారి, ఎంపీడీఓ, ఎంపీఓ సమన్వయంతో పని చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పంచాయతీ కార్యదర్శులు, ఆశా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో అందుబాటులో ఉండాలన్నారు. జిల్లాలో డెంగ్యూ పాజిటివ్ కేసు ప్రైవేట్ ఆస్పత్రిలో నమోదైన మనకు సమాచారం అందేలా వ్యవస్థ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ఆసుపత్రి ఔట్ పేషెంట్‌లో నమోదయ్యే ఫీవర్ కేసులను ఈపీహెచ్‌ఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. రాబోయే 2 వారాల్లో ప్రతి గ్రామపంచాయతీ ఓహెచ్‌ఎస్ఆర్ దగ్గర పరీక్షలు నిర్వహించాలని అన్నారు. విద్యాసంస్థల్లో పారిశుధ్య నిర్వహణకు స్థానిక సంస్థలు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సీజనల్ వ్యాధులు అరికట్టడంలో ఎక్కడైనా నిర్లక్ష్యం వహిస్తే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. ఈసమావేశంలో జెడ్పీసీఈఓ దీక్షా రైనా, జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి కళావతి బాయి, డీపీఓ ఆశాలత, డీసీహెచ్ఎస్ రాజశేఖర్‌గౌడ్, డిప్యూటీ సీఈఓ నాగపద్మజ, డివిజనల్ పంచాయతీ అధికారులు, సూపరింటెండెంట్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధనకు కృషి చేయాలి

ఐజేయూ రాష్ట్రకార్యదర్శి రాంనారాయణ

ఖమ్మం, జూలై 25(ఆంధ్రజ్యోతిప్రతినిధి): జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సాధన, సమస్యల పరిష్కారానికి ఐజేయూ జిల్లా కొత్త కార్యవర్గం కృషి చేయాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.రాంనారాయణ కోరారు. శుక్రవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన నూతన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా రాంనారాయణను జిల్లా కొత్త కార్యవర్గం సత్కరించింది. కార్యక్రమంలో యూనియన్ నూతన అధ్యక్ష, కార్యదర్శులు ఏనుగు వెంకటేశ్వరరావు, మైసా పాపారావు మాట్లాడుతూ మైరా జర్నలిస్టు మహాసభలో తీసుకున్న తీర్మానాలకు అనుగుణంగా పనిచేస్తామన్నారు. ఈ సమావేశంలో ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యుడు అమరవాది రవీంద్రశేషుతో పాటు పలువురు రాష్ట్ర, జిల్లా, నగర నాయకులు పాల్గొన్నారు.

మున్నేరు వరదలపై జాగ్రత్తలు తీసుకోవాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా

ఖమ్మంసంక్షేమ విభాగం,జూలై 25(ఆంధ్రజ్యోతి): గత అనుభవాల నేపథ్యంలో మున్నేరుకు వరదలపై ఖమ్మం నగర పాలక అధికారులు ముందస్తు జాగ్రత్తలు తీసుకొని ప్రజల్ని అప్రమత్తంగా ఉంచాలని సీపీఎం జిల్లా కమిటీ కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం సుందరయ్య భవన్‌లో ఎస్ నవీన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడారు. వరంగల్, పై ప్రాంతాల్లో వరదలను అధికారులు ఎప్పటికప్పుడు తెలుసుకోవాలని కోరారు. ప్రజలకు జరగకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు వై.విక్రమ్, బొంతు రాంబాబు, బండారు రమేష్, ఎంఏ జబ్బార్, దొంగల తిరుపతిరావు, మీరాసాహెబ్, నాగుల్ మీరా, బొడపట్ల సుదర్శన్, భూక్యా శ్రీనివాసరావు, బత్తిని ఉపేంద్ర, వజినేపల్లి శ్రీనివాసరావు, నాగసులోచన పాల్గొన్నారు.



ప్రయాణం.. ప్రాణాంతకం

- ప్రమాదాలకు నిలయంగా కేంద్రీయ విద్యాలయం రహదారి
- ఇసుక లారీలు, ట్రాక్టర్లు, గ్రానైట్ లారీలతో రహదారి ధ్వంసం
- గుంతలు, రోడ్డు కోతతో నిత్యం ప్రమాదాలు



గుంతలమయమైన రహదారి

ఖమ్మంరూరల్, జూలై25 (ఆంధ్రజ్యోతి): పోలేపల్లి పరిధిలోని కేంద్రీయ విద్యాలయం పాఠశాలకు వెళ్లే ప్రధాన రహదారి ప్రాణాంతకంగా మారింది. ఖమ్మం బైపాస్ రోడ్డు నుంచి మారెమ్మతల్లి ఆలయానికి చేరుకునేందుకు అనుసంధానంగా రహదారి ఉంది. మహబూబాబాద్, కొరవి, ములకలపల్లి, కాచిరాజుగూడెం తదితర గ్రామాల నుంచి ఖమ్మం వచ్చే వాహనదారులకు ఈరహదారి అనువుగా ఉంటుంది. దీంతో ప్రయాణికులు ఎక్కువ మంది ఈ రహదారిని ఉపయోగించుకుంటున్నారు. ఖమ్మం నుంచి కేంద్రియ విద్యాలయం పాఠశాలకు వెళ్లే విద్యార్థుల బస్సులు ఈ రహదారిపై నుంచి వెళుతుంటాయి.

భారీ వాహనాలతో ధ్వంసం

ఈ రహదారి పక్కనే కొందరు ఎలాంటి అనుమతులు లేకుండా ఇతర ప్రాంతాల నుంచి పెద్ద మొత్తంలో ఇసుకను లారీల ద్వారా తీసుకువచ్చి కుప్పలుగా పోస్తున్నారు. అక్కడ నుంచి ట్రాక్టర్లద్వారా ఖమ్మం పట్టణంతో పాటు వివిధ ప్రాంతాలకు తరలిస్తుంటారు. పెద్ద పెద్ద గ్రానైట్ రాళ్ల లోడ్లుతో లారీలు సైతం తిరుగుతుంటాయి. ఇసుక లోడ్లతో అతివేగంగా లారీలు, ట్రాక్టర్లు తిరుగుతున్న సమయంలో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. రహదారి ఇరువైపులా కొట్టుకుపోయి పెద్ద పెద్ద గుంతలతో అధ్వానంగా తయారైంది. ఎదురుగా ఏదైనా వాహనాలు వస్తే రోడ్డు కిందకు దిగితే అంతేసంగతులు అన్నట్లుగా మారింది. ఈ రహదారిపై గతంలో అనేక ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు రోడ్డుపై పడిన పెద్ద పెద్ద గుంతలు వర్షపు నీటితో నిండి ఉండటంతో గుంతల్లో వాహనాలుపడి ప్రమాదాలు జరుగుతున్నాయి.బైపాస్‌రోడ్డు నుంచి కేంద్రీయ విద్యాలయం వరకు ప్రస్తుతం సింగిల్ రోడ్డు ఉంది. సుమారు కిలోమీటరు వరకు రెండు వరుసలుగా విస్తరించాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరమ్మతులు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

ఎరువులు బ్లాక్‌లో విక్రయిస్తే చర్యలు

తిరుమలాయపాలెం ఏవో

తిరుమలాయపాలెం,జూలై25(ఆంధ్రజ్యోతి): ఎరువులు అధిక ధరలకు అమ్మితే చర్యలు తీసుకుంటామని ఏవో సీతారాం రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం మండలంలోని పాతర్లపాడు, జూపెడ, దమ్మాయిగూడెం తదితర గ్రామాల్లో ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. డీలర్లు స్టాక్‌బోర్డు, స్టాకు వివరాలు తెలపాలన్నారు. యూరియాను కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవన్నారు. ఈకార్యక్రమంలో ఏఈవోలు ప్రదీప్, బాలకృష్ణ, నవనీత పాల్గొన్నారు.

మంచుకొండ కల్వర్టును పరిశీలించిన సీపీఎం బృందం

రఘునాథపాలెం, జూలై25(ఆంధ్రజ్యోతి): ఖమ్మం ఇల్లెందు రహదారిలోని మంచుకొండ వద్ద కల్వర్టును శుక్రవారం సీపీఎం నాయకులు శుక్రవారం పరిశీలించారు. పనులు ప్రారంభించి ఏడాది గడచినా పూర్తి కాకపోవటంతో వర్షాకాలం రవాణాకు ఇబ్బందిగా మారిందని సీపీఎం మండల కార్యదర్శి ఎస్.నవీన్‌రెడ్డి ఆరోపించారు.ఇల్లెందు,కొత్తగూడెం నుంచి ఖమ్మం, హైదరాబాద్ వంటి నగరాలకు వెళ్లేందుకు మంచుకొండ రహదారి ప్రధానంగా ఉందన్నారు. గుగులోత్ కుమార్, ఇమామ్, రహీం, ఖాదర్, రవీందర్, యాకూబ్ పాల్గొన్నారు.



యూరియా కోసం ఆందోళన

» సొసైటీ కార్యాలయం వద్ద మూడు గంటలపాటు రైతుల నిరసన



సొసైటీ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

తల్లాడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): యూరియా కోసం రైతులు ఆందోళనకు దిగారు. తల్లాడ సొసైటీ కార్యాలయం వద్ద శుక్రవారం మూడు గంటలపాటు నిరసన చేపట్టారు. రైతుల ఆందోళన నేపథ్యంలో మండలంలోని వేరే సొసైటీకి తరలించాల్సిన యూరియాను కూడా తల్లాడ సొసైటీ కార్యాలయం వద్దే రైతులకు పంపిణీ చేశారు. యూరియా కోసం శుక్రవారం ఉదయాన్నే తల్లాడ సొసైటీ కార్యాలయానికి 200 మందికిగాపై రైతులు వచ్చారు. ఇదే సమయంలో ఈ సొసైటీకి 10టన్నులు, మండలంలోని గంగదేవిపాడు సొసైటీకి మరో 10 టన్నులు మొత్తం 20 టన్నుల యూరియా లోడ్‌తో లారీ వచ్చింది. తల్లాడ సొసైటీ కార్యాలయంలో పదిటన్నులు యూరియాను దిగుమతి చేసిన అనంతరం మరో పది టన్నులు యూరియాను గంగదేవిపాడు సొసైటీకి తరలిస్తున్న లారీని రైతులు అడ్డుకుని ఆందోళన చేపట్టారు తమకు సరిపడా యూరియా సరఫరా చేయాలని రైతులు డిమాండ్ చేశారు. ఆందోళన విషయాన్ని తెలుసుకుని సొసైటీ కార్యాలయం వద్దకు వచ్చిన సత్తుపల్లి వ్యవసాయ సహాయ సంచాలకుడు శ్రీనివాసరెడ్డి, తహసీల్దార్ బాబ్జి ప్రసాద్, ఏవో ఎండీ తాజుద్దీన్, ఎస్ఐ ఎన్.వెంకటకృష్ణ రైతులతో చర్చించారు. రైతుల డిమాండ్ల గురించి జిల్లా వ్యవసాయశాఖ అధికారి పుల్లయ్యకు ఏవో తాజుద్దీన్ ఫోన్‌చేసి వివరించారు. దీంతో గంగదేవిపాడు సొసైటీకి తరలించాల్సిన పది టన్నుల యూరియాను కూడా తల్లాడ సొసైటీ కార్యాలయం వద్ద ఉన్న రైతులకు పంపిణీచేయడంతో రైతులు ఆందోళన విరమించారు. ఈకార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకుడు ఆపతి వెంకటరామారావు, గాదె కృష్ణారావు, రైతులు గుండ్ల నాగయ్య, పులబాల నరసింహారావు, కటికి నరసింహారావు, వజ్రాల సత్యనారాయణరెడ్డి, లక్ష్మి, మంగేశ్వరి తదితరుల పాల్గొన్నారు.

రైతులకు అందుబాటులో యూరియా

చింతకాని, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల రైతులకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని ఏవో సోములపల్లి మానస అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని చింతకాని, నాగులవంచ సొసైటీలను ఆమె తనఖీ చేశారు. గోదాములోని నిల్వలను, రికార్డులను పరిశీలించారు. రైతులు మోతాదుకు మించి యూరియా వాడరాదని, యూరియాను నిల్వ చేసుకోవాడానికి కాకుండా పంటలకు కావాల్సిన మోతాదు మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. సీఈవో శ్రీనివాసరావు, డైరక్టర్‌లు కిలారు మనోహర్, మాదిన్ని రవి, రైతులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన



అవగాహన కలిగిస్తున్న మేనేజర్ శోభన్‌బాబు

ఏన్కూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బురదరాఘవాపురం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సైబర్‌నేరాలు, ఆర్థిక మోసాలు, అప్రమత్తత, సేవింగ్స్, జీరో బ్యాలెన్స్ ఖాతాలు, ఇన్సూరెన్సు పాలసీల గురించి వివరించారు. ఏన్కూరు గ్రామీణ బ్యాంక్ మేనేజర్ శోభన్ బాబు, ఫీల్డ్ ఆఫీసర్ సుమంత్, పాఠశాల హెచ్ఎం సాగి సుజాత, ఉపాధ్యాయులు పొట్ట రామారావు, ఎం.పుల్లయ్య పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన నాయకులు

కారేపల్లి జూలై 25 (ఆంధ్రజ్యోతి): బీజేపీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ రామచంద్రరావును కారేపల్లి మండల నాయకులు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వైరా నియోజకవర్గం పరిధిలోని రాజకీయ పరిస్థితులను రామచంద్రరావు అడిగి తెలుసుకున్నారు. స్థానిక సంస్థలలో పార్టీ అభ్యర్థులను పోటీలో నిలిపి అధిక స్థానాల్లో గెలవాలని ఆయన సూచించినట్లు సమాచారం. కార్యక్రమంలో జిల్లా సీనియర్ నాయుకులు తురక నారాయణ, జిల్లా అధికార ప్రతినిధి కల్తి రాంప్రసాద్, వాకాటి సురేష్‌తో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

రాజీవ్‌నగర్‌లో మెడికల్ క్యాంపు



మెడికల్ క్యాంపులో వైద్యపరీక్షలు చేస్తున్న దృశ్యం

వైరా, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ ఆదేశాలతో శుక్రవారం వైరా మునిసిపాలిటీ నాల్గో వార్డు రాజీవ్‌నగర్ కాలనీలో మెడికల్ క్యాంపు నిర్వహించారు. డాక్టర్ శ్రీహర్ష ఆధ్వర్యంలో రాజీవ్‌నగర్ కాలనీ ప్రజలకు వైద్య సిబ్బంది పరీక్షలు చేసి అవసరమైన మందులను పంపిణీ చేశారు. మునిసిపల్ కమిషనర్ చింతా వేణు, సిబ్బంది పాల్గొన్నారు.

జేవీఆర్‌లో అతిథి అధ్యాపకులకు ఆహ్వానం

సత్తుపల్లిరూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): జేవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ నంద్రు గోపీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-26సంవత్సరానికి గాను ఇంగ్లీష్ (2), ఒకటి చొప్పున హిందీ, హిస్టరీ, ఫిజిక్స్, జువాలజీ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అధ్యాపకుల నియామకాలకు ఈనెల 30వ తేదీన ఖమ్మంలోని ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్ ప్రభుత్వ కళాశాలలో డెమో ఇంటర్వ్యూ పద్ధతి ద్వారా అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. సంబంధిత సబ్జెక్టులో 55శాతం మార్కులు, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులకు 50శాతం మార్కులు సాధించి ఉండాలని, నెట్/సెట్/పీహెచ్‌డీ అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈనెల 29వ తేదీ సాయంత్రం 4గంటల లోపు పూర్తి బయోడేటాతోపాటు సర్టిఫికేట్ల జిరాక్స్ జతచేసి అప్లికేషన్‌ను జేవీఆర్ కళాశాలలో అందజేయాలని కోరారు.

స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆవిర్భావం



సమావేశమైన అసోసియేషన్ నాయకులు

వైరా, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వైరా స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ ఆవిర్భవించింది. నియోజకవర్గంలోని క్రీడాకారులు, కళాకారులను ప్రోత్సహించాలనే సంకల్పంతో ఏర్పాటుచేసిన అసోసియేషన్‌ను ఈనెల 27వతేదీ సాయంత్రం ఎస్‌వీఎస్ గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో స్థానిక ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ప్రారంభిస్తారని నిర్వాహకులు తెలిపారు. తెలంగాణ హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్యే కొండబాల కోటేశ్వరరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పలువురు పాల్గొంటారని తెలిపారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా మాజీ ఎంపీపీ కట్టా కృష్ణార్జున్‌రావు, ఉపాధ్యక్షుడిగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శిగా రిటైర్డ్ టీచర్ చల్లా కృష్ణారావులను ఎన్నుకున్నారు.

నత్తనడకన డ్రెయినేజీ పనులు

మధిర,జూలై 25 (ఆంధ్రజ్యోతి): మధిర పట్టణంలో చేస్తున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులు నాసి రకంగా నత్తనడకన సాగుతున్నాయని బీజేపీ నాయకులు అన్నారు. శుక్రవారం మధిరలో పలు వార్డుల్లో జరుగుతున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులను వారు పరిశీలించారు. పనుల పేరుతో రోడ్డును తవ్వి సరిగా గుంటలు పూడ్చక పోవడంతోపాటు అందుకు తోడు వర్షాలు కురుస్తుండటంతో రహదారులు నడవటానికి వీలు లేకుండా ఉన్నాయని అన్నారు. తక్షణమే తవ్విన రోడ్లను పూడ్చాలని లేక పోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేయడం జరుగుతుందని అన్నారు. బిజెపి పట్టణ అధ్యక్షులు సుమంత్, నాయకులు రామిశెట్టి నాగేశ్వరరావు, చిలివురు సాంబశివరావు, రమేష్, కృష్ణారావు పాల్గొన్నారు.

సీపీఎస్, యూపీఎస్‌లను రద్దుచేసి ఓపీఎస్ అమలు చేయాలి

సత్తుపల్లిరూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్, యూపీఎస్ రద్దుచేసి ఓపీఎస్ అమలు చేయాలని ఆల్ పెన్షనర్స్, రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు వైకుంఠరావు, ఎంఎస్ఆర్.శర్మ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం సత్తుపల్లిలోని రింగ్‌సెంటర్‌లో దేశ వ్యాప్త ఆందోళనలో మానవహారం నిర్వహించారు. కార్యక్రమంలో బాల నాగేశ్వరరావు, సాయి, వెంకటేశ్వరరావు, గంగాధరరాజు, రమేష్, శ్రీనివాసరావు, సూర్యనారాయణ, రామారావు, ప్రసాద్, నాగేశ్వరరావు, ప్రసాద్, బోస్, దశరథ రామశాస్త్రి పాల్గొన్నారు.



అంబులెన్స్‌లో రిజిస్ట్రేషన్‌కు వచ్చిన వృద్ధుడు

వైరా, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వైరా తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం అరుదైన సంఘటన జరిగింది. అనారోగ్యంతో ఉన్న ఒక వృద్ధుడు తన భార్యతో కలిసి అంబులెన్స్‌లో వచ్చి తమ పేరుపై ఉన్న భూములను కుమార్తె, మనుమరాలికి రిజిస్ట్రేషన్ చేశారు. మండలంలోని దాచాపురం గ్రామానికి చెందిన వనమా విశ్వనాథం కొన్ని సంవత్సరాలుగా వైరాలోని పోస్టాఫీసు సమీపంలో నివాసముంటున్నాడు. పోస్టాఫీసు నడుస్తున్న భవనం ఆయనదే. అయితే ఇటీవల విశ్వనాథం కాలు విరగడంతో అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఆయన ఆరోగ్య పరిస్థితి కొంత ఆందోళనకరంగా ఉంది. దీంతో దాచాపురం రెవెన్యూ గ్రామ పరిధిలో తన పేరుపై ఉన్న 7.39ఎకరాల భూమిని కుమార్తె నాగమణి పేరుకు ఇంకో సర్వే నెంబర్‌లో తన పేరుపై ఉన్న 0.30ఎకరాలు, అలాగే తన భార్య సరోజిని పేరుపై ఉన్న 1.26ఎకరాల భూమిని మనుమరాలు శిల్పకు రిజిస్ట్రేషన్ చేశారు. అంబులెన్స్ తహసీల్దార్ కార్యాలయానికి రావడంతో అక్కడున్న ప్రజలు కొంత అలజడికి లోనయ్యారు. అసలు విషయం తెలిసి ఊపిరిపీల్చుకున్నారు. విశ్వనాథం దంపతుల పేర్లపై ఉన్న భూములను కుమార్తె, మనుమరాలికి రిజిస్ట్రేషన్ చేసి వెళ్లిపోయారు.

'ఓపెన్'కు దరఖాస్తు చేసుకోవాలి

బోనకల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తూటికుంట్ల గ్రామంలోని చైతన్య విద్యాలయంలో 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఓపెన్ టెన్త్, ఇంటర్ అడ్మిషన్లకు దరఖాస్తులు చేసుకోవాలని కరస్పాండెంట్ షేక్ హుస్సేన్ కోరారు. ఎంఆర్‌సీలో శుక్రవారం ఓపెన్ టెన్త్, ఇంటర్ దరఖాస్తుల ఆహ్వానం కోరుతూ పోస్టర్లను ఎంఈవో దామాల పుల్లయ్య చేతుల మీదుగా ఆవిష్కరించారు. హెచ్ఎం శ్రీనివాసరావు, రేగళ్ల రాణి, నాగుల్‌మీరా, మల్లికార్జున్ పాల్గొన్నారు.

కల్లూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): కల్లూరులో విజ్ఞాన్ పాఠశాల ఆధ్వర్యంలో ఓపెన్ స్కూల్‌కు సంబంధించిన గోడప్రతులను తహసీల్దార్ సాంబశివుడు శుక్రవారం ఆవిష్కరించారు. అనివార్య కారణాలతో, ఆర్థిక ఇబ్బందులతో, మధ్యలో చదువు మానివేసిన వారు ఓపెన్ స్కూల్ అడ్మిషన్ పొందవచ్చు అని ఆయన అన్నారు. ఓపెన్ టెన్త్, ఇంటర్ పాసైన వారు రెగ్యూలర్ సర్టిఫికెట్‌తో సమానమని అన్నారు. ప్రిన్సిపాల్ యస్‌కె ఇస్మాయిల్, అసిస్టెంట్ కోఆర్డినేటర్ కోటా పుల్లారావు, ఉపాధ్యాయులు ఎస్‌కె నాజీ, పుల్లారావు, రవికాంత్ పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

చింతకాని, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన యువతి అదృశ్యమైనట్లు స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. యువతి తల్లితండ్రులు గురువారం ఉదయం పొలం పనులకు వెళ్లి తిరిగి సాయంత్రం ఇంటికి రాగా.. ఇంట్లో ఆమె లేదు. దీంతో ఆచూకి కోసం బంధువులు, స్నేహితుల వద్ద ప్రయత్నించినప్పటికి ఫలితం లేకపోవడంతో యువతి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ నాగుల్ మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

వన మహోత్సవాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

కారేపల్లి జూలై 25 (ఆంధ్రజ్యోతి): వనమహోత్సవ కార్యక్రమాన్ని మండల కేంద్రంలో శుక్రవారం వైరా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ ప్రాంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంతరించిపోతున్న అడువులను సంరక్షించుకునేందకు ప్రభుత్వం చేపట్టిన వనమహోత్సవంలో ప్రతి ఒక్కరు పాల్గొని మొక్కలు నాటి వాటి సంరక్షణ కోసం కృషి చేయాలన్నారు. మండల కేంద్రంలోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో అధికారులు, మాజీ ప్రజాప్రతినిదులు, కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి మొక్కలు నాటారు.

ఘనంగా ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు

రాందాస్ నాయక్ పుట్టిన రోజు సందర్భంగా పార్టీ కార్యలయంలో కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. నాయకులు డాక్టర్ పట్టాభి రామారావు, రాంమూర్తి, దేవ్లా, పగడాల మంజుల, చంద్రప్రకాష్, సురేందర్ మనియర్, తిరుపతిరావు, నాగేశ్వరరావు, ఎండి యాకుబ్, బీముడు, హరిలాల్, సుధాకర్, మెదరిటోని, అదేర్లరాములు, అడప పుల్లారావు అడ్డగోడ ఐలయ్య, గమిడి నర్సింహారావు పాల్గొన్నారు.

వైరా, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ జన్మదిన వేడుకలను శుక్రవారం వైరాలో ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ క్యాంపు కార్యాలయంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్



వైరాలో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్ నాయక్

చైర్మన్ రాయల నాగేశ్వరరావు ఎమ్మెల్యేతో కేక్ కట్ చేయించి స్వీట్ తినిపించారు. పట్టణ, మండల కాంగ్రెస్ అధ్యక్షులు ఏదునూరి సీతరాములు, శీలం వెంకటనర్సిరెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కట్ల రంగారావు, మునిసిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, పలువురు నాయకులు పాల్గొన్నారు.

ఏన్కూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ జన్మదిన వేడుకలు శుక్రవారం ఏన్కూరులో ఘనంగా నిర్వహించారు. ప్రధాన సెంటర్‌లో కేక్‌కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు స్వర్ణ నరేంద్రకుమార్,ఏబ్లాక్ అధ్యక్షుడు వేముల కృష్ణప్రసాద్, నాయకుల మేడా ధర్మారావు, కట్టా సత్యానారాయణ, వాసిరెడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

కొణిజర్ల, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో శుక్రవారం వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షులు వడ్డే నారాయణరావు, జిల్లా కాంగ్రెస్ నాయకులు, కొణిజర్ల మాజీ సర్పంచ్ సూరంపల్లి రామారావు ఆధ్వర్యంలో కేకు కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. నాయకులు కోసూరి శ్రీనివాస్‌రావు, మాజీ ఎంపీపీ గోసు మధు, సొసైటీ వైస్ చైర్మన్ నెల్లూరు రమేష్, చిరంజీవి, మోష, రాయల పుల్లయ్య పాల్గొన్నారు.

వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

ముదిగొండ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని వ్య.కా.సం జిల్లా అధ్యక్షుడు మేరుగు సత్యనారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నం వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక మచ్చా వీరయ్య భవనంలో జరిగిన వ్య.కా.సం మండల మహాసభలో వారు మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో ప్రతి సంవత్సరం నిధులు తగ్గిస్తూ ఆ పథకాన్ని నిర్వీర్యం చేస్తోందన్నారు. ఎన్నికల హామీల్లో భాగంగా వ్యవసాయ కూలీలకు రూ.2500 ఇస్తామన్న ప్రకటించారని అవి ఎప్పుడిస్తారో తెలపాలన్నారు. రూ.500కే గ్యాస్ సిలీండర్ పథకం ఏమైందని ప్రశ్నించారు. అనంతరం వ్య.కా.సం మండల నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా రాయల శ్రీనివాస్, వేల్పుల భద్రయ్యతో కూడిన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో వ్య.కా.సం రాష్ట్ర నాయకులు జానకీరాములు, ఎర్రా శ్రీనివాస్, సీపీఎం మండల కార్యదర్శి పురుషోత్తం, నాయకులు కల్యాణ్, కందితిరుపతి, రాంబాబు, నారాయణ, సునీత, లక్ష్మణ్, పద్మ పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ



చెక్కులను పంపిణీ చేస్తున్న దృశ్యం

మధిర, జూలై 25 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సిఫార్సుతో మంజూరైన సీఎం సీఎం సహాయనిధి చెక్కులను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అనారోగ్యంతో వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందిన మధిర పట్టణం, రూరల్ గ్రామాలకు చెందిన 47మందికి రూ.17 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. కాంగ్రెస్ నాయకులు నిడమానూరి వంశీ, చావా వేణు, యన్నం కోటేశ్వరరావు, కర్నాటి రామారావు, అద్దంకి రవి, జహంగీర్, రమణ, బాబు, సంగయ్య, చక్రీ, వెంకయ్యబాబు, మాగం ప్రసాద్, తలుపుల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

చింతకాని, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని లచ్చగూడెం, సీతంపేట, పొద్దుటూరు, నేరడ, బస్వాపురం గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సిఫార్సు మేరకు మంజూరైన సీఎం సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పంపిణీ చేశారు. నాయకులు కూరపాటి కిషోర్, కొప్పుల గోవిందరావు, నారపోగు కొండలరావు, కొత్తపల్లి బసవయ్య, పోలూరి పుల్లారావు, శ్రీరాముల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

» సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే దంపతులు

సత్తుపల్లి, జూలై 25 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణను ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని, ఇంటి పరిసరాల్లో, ఖాళీ ప్రదేశాల్లో మొక్కలు నాటి సంరక్షించాలని సత్తుపల్లి ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి కోరారు. మునిసిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని జ్యోతి నిలయం స్కూల్ వద్ద వనమహోత్సవంలో భాగంగా 2.81లక్షల మొక్కలు నాటే కార్యక్రమాన్ని శుక్రవారం ఆమె ప్రారంభించారు. ప్రజలు మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. పర్యావరణ సమతుల్యత లోపించడం వల్ల ప్రకృతిలో అతివృష్టి, అనావృష్టి లాంటి అనర్థాలు సంభవిస్తున్నాయని, కాలుష్యాన్ని తగ్గించేందుకు పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. అనంతరం ప్రభుత్వ గ్రంథాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా పోటీ పరీక్షల నిమిత్తం పుస్తకాలను అందజేయాలని రీడర్స్ ఎమ్మెల్యేను కోరగా పరిశీలించి ఏర్పాటు చేయాలని కమిషనర్ కొండ్ర నరసింహాను ఆదేశించారు. నాయకులు చల్లగుళ్ల నరసింహారావు, ఉడతనేని అప్పారావు, గాదె చెన్నారావు, ఎండీ.కమల్‌పాషా, జక్కుల ప్రభాకర్, దూదిపాల రాంబాబు పాల్గొన్నారు.

ముంపు ప్రాంతాలను పరిశీలించిన అదనపు కలెక్టర్

వైరా, జూలై 25 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపాలిటీ పరిధిలోని వరద ముంపు ప్రాంతాలను జిల్లా అదనపు కలెక్టర్ డాక్టర్ శ్రీజ శుక్రవారం సందర్శించి పరిశీలించారు. మునిసిపాలిటీ మూడోవార్డు పరిధిలోని రిజర్వాయర్ లోతట్టు ప్రాంతంలో ఉన్న రాజీవ్‌నగర్ కాలనీలోని ఇళ్లు, పరిసరాలను ఆమె పరిశీలించారు. అక్కడి నుంచే రిజర్వాయర్ నీటిమట్టంపై ఆరా తీశారు. ఈ నివాసాల వారు రిజర్వాయర్ వైపు వెళ్లకుండా తగు చర్యలు తీసుకోవాలని, ముళ్ల కంచె ఏర్పాటుచేయాలని తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, మునిసిపల్ కమిషనర్ చింతా వేణును ఆదేశించారు. అంటు వ్యాధులు ప్రబలకుండా మెడికల్ క్యాంపు నిర్వహించాలని కమిషనర్‌ను ఆదేశించారు. తాము 20ఏళ్ల నుంచి ఇక్కడ నివాసాలు ఏర్పాటుచేసుకుని ఉంటున్నామని, తమకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలని అక్కడి ప్రజలు అదనపు కలెక్టర్‌ను కోరారు. అయితే ఆమె స్పందిస్తూ రిజర్వాయర్ లోతట్టులో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించటం సాధ్యం కాదని స్పష్టం చేశారు. తరచూ వరదనీరు వస్తుందని ఇక్కడ నివాస యోగ్యం కాదని స్పష్టం చేశారు. వేరే ప్రాంతాల్లో భూముల లభ్యతను బట్టి ఇండ్లస్థలాల పట్టాలు, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై తగు చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌ను ఆమె ఆదేశించారు. ఆతర్వాత మధిర రోడ్డులోని ముంపు ప్రాంతమైన ఇందిరమ్మ కాలనీని సందర్శించి పరిశీలించారు. సోమవరం నల్లచెరువు వాగులో ఉధృతంగా ప్రవహిస్తున్న నీటి గురించి ఆరా తీశారు. ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.ఆతర్వాత ఓటర్ల జాబితా సవరణలపై తహసీల్దార్ కార్యాలయంలో స్థానిక రాజకీయ పార్టీలతో జరిగిన సమావేశంలో పలు సూచనలు చేశారు.



అధికారులకు సూచనలు చేస్తున్న శ్రీజ

యోగా ఇన్‌స్ట్రక్టర్ మృతితో కదిలిన జిల్లా యంత్రాంగం

» యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య పనులు



స్థానికులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

తల్లాడ, జూలై 25 (ఆంధ్రజ్యోతి): డెంగీతో యోగా ఇన్‌స్ట్రక్టర్ కందుల శ్రీదేవి మృతితో జిల్లా అధికార యంత్రాంగం కదిలింది. శుక్రవారం తల్లాడలో జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజ, డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి, డీపీవో ఆశాలతలు పర్యటించారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో యుద్ధ ప్రాతిపదికన పారిశుధ్య పనులు చేపట్టారు. శ్రీదేవి మృతికి గల అనారోగ్య కారణాల గురించి ఆమె కుటుంబ సభ్యులు, వైద్య ఆరోగ్య సిబ్బందితో విడివిడిగా స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అదనపు కలెక్టర్ రహస్య విచారణ నిర్వహించారు. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో సొసైటీ కార్యాలయం ఏరియాలో జేసీబీతో సైడ్‌డ్రెయిన్లలో పూడిక తొలిగింపు, బ్లీచింగ్ చల్లి పారిశుధ్య కార్యక్రమం చేపట్టారు. పారిశుధ్య పనులను డీపీవో పరిశీలించారు. జన నివాస ప్రాంతాల్లో పందుల సంచారాన్ని అరికట్టాలని ఈవో కృష్ణారావును డీపీవో ఆదేశించారు. ఈసందర్భంగా తల్లాడ మండలంలో పారిశుధ్య నిర్వాహణ అధ్వాన్నంగా ఉందని, చెత్తాచెదరం ఎక్కడిక్కడ రోడ్లపై పేరుకుపోయి ఉన్నందున ప్రజలకు అంటు వ్యాధులు ప్రబలే అవకాశాం ఉండడంతో యుద్ధప్రాతిదికన పారిశుధ్య నిర్వాహణ పనులు చేపట్టాలని అదనపు కలెక్టర్‌కు బీజేపీ జిల్లా నాయకుడు అపతి వెంకటరామారావు, గాదె కృష్ణారావు వినతిపత్రం అందించారు. ఈకార్యక్రమంలో డిప్యుటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సీతారాం, ప్రోగ్రాం ఆఫీసర్ రామారావు, చందునాయక్, ఎంపీడీవో సురేష్‌బాబు, మండల వైద్యాధికారి డాక్టర్ ఐ.రత్నమనోహర్ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ



భూమిపూజలో పాల్గొన్న నాయకులు

చింతకాని, జూలై 25 (ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం పురస్కరించుకుని మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ కార్యక్రమం నిర్వహించారు. లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటి నిర్మాణాలు చేపట్టాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో నాయకులు అంబటి వెంకటేశ్వర్లు, మడిపల్లి భాస్కర్, కన్నెబోయిన గోపి, కొప్పుల గోవిందరావు, ఏతఈ సుప్రియ, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



నీడనిచ్చే చెట్టు.. భలేగుందే!

ఎండకు, వానకు గొడుగులా.. ఆరోగ్యానికి 'ఔషధం'లా..

ఆకర్షిస్తున్న సిద్ధారంలోని నక్కరేగుపండ్ల చెట్టు

సత్తుపల్లిరూరల్, జూలై 25 (ఆంధ్రజ్యోతి) : ఈ చిత్రంలోని చెట్టును చూశారా... గొడుగులా భలేగుంది కదూ. దీన్ని నక్కరేగుపండ్ల చెట్టుగా పిలుస్తుంటారు. ఇది గొడుగులా నీడనివ్వడమే కాదు.. ఈ చెట్టు కాయలు, ఆకుల్లో ఎన్నో ఔషధగుణాలు కూడా ఉన్నాయని చెబుతుంటారు. సత్తుపల్లి మండలం సిద్ధారం గ్రామానికి చెందిన తోటకూరి రాములు, నారాయణమ్మ దంపతులు నాలుగేళ్ల క్రితం తాళ్లమడ గ్రామం నుంచి నక్కరేగుపండ్ల మొక్కను తెచ్చి తమ ఇంటి ఎదుట నాటగా.. ఇప్పుడు అది సుమారు 15అడుగులకుపైగానే పెరిగింది. అయితే వారు ప్రతి నెలా కొమ్మలను కత్తిరిస్తూ ఉండటంతో అది ఇదిగో ఇలా గొడుగులా మారి నీడనిస్తోంది. చిన్నపిల్లల నుంచి పెద్దల వరకు ఎండాకాలంలో ఆ చెట్టు నీడన సేదదీరుతుంటారు. నక్కరేగుపండ్ల చెట్టుగా పిలుచుకునే ఇది ముంటింటియేసి కుటుంబానికి చెందిన మొక్క జాతిగా చెబుతున్నారు. దీనిని వివిధ ప్రాంతాల్లో కుక్కమోగి అని, ఇండియన్ చెర్రీగా, జమైకా చెర్రిగా, పనామా చెర్రీ, సింగపూర్ చెర్రీగా, మంటింగి కాలబోరా ఫ్రూట్‌గా పిలుస్తారని జీవశాస్త్ర, పర్యావరణ నిపుణులు చెబుతున్నారు. దీని ఆకులను షుగర్ వ్యాధిగ్రస్థులు తీసుకోవచ్చునని, పువ్వులతో తలనొప్పి, జలుబు తగ్గుతుందని, యాంటీబ్యాక్టీరియల్‌గా పనిచేసే ఎర్రటి పండ్లను ఎవరైనా తినొచ్చని, ఇన్ఫెక్షన్లు తగ్గుతాయని, అంటువ్యాధులను తగ్గిస్తుందని, డిఫ్తీరియాతోపాటు గుండెవ్యాధులకు కూడా పనిచేస్తుందని చెబుతున్నారు.

నాటు తుపాకీ కలిగిన ఇద్దరిపై కేసు

కల్లూరు, జూలై 25 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని తాళ్లూరు వెంకటాపురం గ్రామంలో ఇద్దరు వ్యక్తులు ఎలాంటి ఆయుధ లైసెన్స్ లేకుండా నాటు తుపాకులు కలిగి ఉండటంతో వారిపై శుక్రవారం స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలిలా ఉన్నాయి. తాళ్లూరు వెంకటాపురం గ్రామంలోని ఓ చెరువు మీద కాపాలా ఉంటున్న ఘంటసాల లక్ష్మీనారాయణ, ఘంటసాల పెద్దిరాజులు ఎటువంటి ఆయుధ లైసెన్స్ లేకేండా అక్రమంగా నాటు తుపాకులు, గన్ పౌడర్ ఉపయోగిస్తున్నట్లు సమాచారం అందగా వారిని అదుపులోకి తీసుకోని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ హరిత తెలిపారు.



నాటు తుపాకులు, గన్‌పౌడర్‌ను స్వాధీనం చేసుకున్న పోలీసులు